ప్రజాశక్తి

శుక్రవారం 11 అక్టోబర్ 2024 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

కలెక్టర్‌కు నమస్కరిస్తున్న చెంచు చిన్నారులు

చెంచుల జీవన ప్రమాణాలు

మెరుగయ్యేలా ప్రత్యేక చర్యలు

• కలెక్టర్ తమీమ్ అన్సారియా • బాల ప్రకాశ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

చెంచుల జీవన ప్రమాణాలు మెరుగు పరచటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. యర్రగొండపాలెం మండలం గంజివారిపల్లి పంచాయతీ పరిధిలోని అల్లిపాలెం చెంచు గూడెంలో సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూ.26 లక్షలతో నిర్మించిన బాల ప్రకాశ భవనంను గురువారం జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్‌తో కలసి ప్రారంభించారు. బాల ప్రకాశ భవనం పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ఈ ప్రాంత చెంచు గిరిజనుల విద్యా ప్రమాణాలు మెరుగుపర్చేందుకు సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. చెంచుల జీవనప్రమాణాలు అభివృద్ధి పరచడానికి, వారికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జన్‌మన్ కార్యక్రమం కింద ▶ 2లో

సవాల్‌గా ఇసుక సమస్య

- బయట జిల్లాల నుంచి తెప్పించేందుకు అధికారుల సన్నాహాలు
- జిల్లాలో అనధికారిక ఇసుక రీచ్‌ల్లో పాలకపక్షం దందా
- ధరలను నియంత్రించడంలో ఇప్పటికీ కొనసాగుతున్న వైఫల్యం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఇసుక ఉచితం అని ప్రభుత్వం అంటున్నా.. ట్రక్కు రూ.ఐదారు వేలకు కొనాల్సి వస్తోంది. ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని తెచ్చింది. రవాణా, ఇతర ఛార్జీల పేరుతో స్వల్పంగా డబ్బులు వసూలు చేయాల్సి ఉంది. అధికారికంగా ట్రక్కు ఇసుక రూ.2 వేల లోపే దొరకాలి. ఇప్పుడు అలా లేదు. నాలుగు నెలలుగా ట్రక్కు ఇసుక రూ.ఐదు వేలకు పైనే ఉంది. ఇదే ధరకు నిర్మాణదారులు కొంటున్నారు. అనధికారిక రీచ్‌లను పాలకపక్షం తమ గుప్పెట్లో పెట్టుకొని వ్యాపారం చేస్తోంది. దీంతో బహిరంగ మార్కెట్‌లో భారీగానే ధరలున్నాయి. అధికారుల ద్వారా ఎంతమంది కొన్నారన్నదే ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఇసుక ధరలను నియంత్రించడంలోనూ, నిర్మాణాలకు అవసరమైన ఇసుకను సరఫరా చేయడంలోనూ అధికార యంత్రాంగం ఇక్కట్లు పడుతోంది. ఇంకా చెప్పాలంటే ఇసుక అంశం ఇటు అధికారులకూ సవాలుగా మారింది. తర్జనభర్జన పడుతున్నారు.

ఇసుకపై ప్రభుత్వం తీసుకున్న పాలసీలో లోపం ఉందా? అనేదీ స్పష్టత లేదు. అధికారులు కూడా ఆంక్షలను అధిగమించి ఇసుక దందాలను నియంత్రించడంలో పూర్తిగా సఫలీకృతం కాలేకపోతున్నారు. ఇసుక అక్రమ రవాణాపై మెతకవైఖరే కొనసాగుతోంది. ఎందుకంటే కొన్ని రీచ్‌ల నుంచి పాలకపక్ష నేతలు ఇసుకను తరలిస్తున్నారు. ఇదే ఇప్పుడు పెద్ద వ్యాపారంగా మారింది. దీన్ని నియంత్రణ చేయలేకపోతున్నారు. పాలకపక్ష పెద్దల హస్తంతోనే సాగుతోంది. క్షేత్రస్థాయిలో పోలీసులూ ఇందుకు సహకరిస్తున్నారనే విమర్శలూ లేకపోలేదు. ట్రక్కు ఇసుక ఐదారు వేలకు అమ్ముతున్నారంటే ఉచితం అనే పేరుకు అర్థం లేకుండా పోయింది. ఇప్పటికీ కొలిక్కిరాలేదు. వాల్టా చట్టం ప్రకారం అధికారులు కొన్ని రీచ్‌ల నుంచి ఇసుకను అధికారికంగా తీయడానికి వీల్లేదు. అయితే అనధికారికంగా అదే రీచ్‌లనుంచి పాలకపక్ష నేతలు ఇసుకను తరలిస్తున్నారు. ట్రాక్టర్‌కు ఇంతని, లారీకి ఇంతని అదనంగా పాలకపక్ష నేతలు వసూళ్లు చేస్తున్నారు. దాన్ని తెచ్చుకునే వాహనదారులు వాళ్లకు కొంత లాభం చూసుకుని బయట అమ్ముకుంటున్నారు. ప్రస్తుతం ఇసుక సంక్షోభం మాత్రం తొలగిపోలేదు. రాజకీయ పార్టీలూ ఇసుకపై ఆందోళనలకు దిగుతున్నాయి. ఇసుక సమస్యపై ఇప్పటికే సిపిఎం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టింది. దీంతో కలెక్టర్ అన్సారియా, ▶ 2లో

శాంసంగ్ షోరూమ్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

శాంసంగ్ కార్మికుల డిమాండ్లు నెరవేర్చండి..

ఒంగోలులోని షోరూమ్ వద్ద సిఐటియు ధర్నా

8లో ▶

మద్యం షాపులకు 1346 దరఖాస్తులు

- 14న లాటరీ తీస్తాం..
- ఎక్సైజ్ సూపరింటెండెంట్ దేవదత్ వెల్లడి..

మాట్లాడుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ దేవదత్

ప్రజాశక్తి-బాపట్ల

జిల్లాలో 117 మద్యం షాపులకు 1346 దరఖాస్తులు నమోదయ్యాయని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.దేవదత్ తెలిపారు. మద్యం షాపులకు దరఖాస్తుల వివరాలను సూపరింటెండెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. బాపట్లలో 19 షాపులకు 191 దరఖాస్తులు వచ్చాయన్నారు. రేపల్లె 12 షాపులకు 81, వేమూరు 12కు 92, నగరం 12 షాపులకు 109, చీరాల 24 షాపులకు 281, పర్చూరు 15 షాపులకు 344, అద్దంకి 23 షాపులకు 248 అప్లికేషన్లు ఇప్పటివరకు అందాయని తెలిపారు. ఈ నెల 11న సాయంత్రం ఏడు గంటల వరకు మద్యం షాపుల కోసం దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈ నెల 14న బాపట్లలో జమ్మలపాలెం ఫ్లైఓవర్ వద్ద గల ఎమ్మెస్సార్ కళ్యాణ మండపంలో జిల్లా కలెక్టర్, ఆర్డీవోల సమక్షంలో షాపులకు లాటరీ తీయడం జరుగుతుందన్నారు. ఉదయం 8 గంటలకే లాటరీ తీసే విధానం ప్రారంభమవుతుందన్నారు. దరఖాస్తుదారులు ఉదయం ఏడు గంటలకే లాటరీ తీసే సెంటర్‌కు చేరుకోవాలని సూచించారు. క్రమసంఖ్య విధానం ద్వారా లాటరీ పద్ధతి కొనసాగుతుందన్నారు. లాటరీకి నాలుగు డెస్కులు ఏర్పాటు చేశామన్నారు. లాటరీలో షాపులు దక్కించుకున్న వారు మొదటి విడత చెల్లించాల్సిన కిస్తీ నగదును అక్కడే చెల్లించాలన్నారు. ఈ నెల 16న షాపులను ప్రారంభించుకోవచ్చన్నారు. బాపట్ల పట్టణంలో ఏడు షాపులకు 77 అప్లికేషన్లు వచ్చాయన్నారు. బాపట్ల రూరల్ మండలంలో 4 షాపులకు 48, పిట్టలవానిపాలెం మండలంలో 4 షాపులకు 45, కర్లపాలెంలో 4 షాపులకు 36 అప్లికేషన్లు వచ్చాయన్నారు. దరఖాస్తుదారులు సకాలంలో లాటరీ తీసే సెంటర్‌కు చేరుకొని అధికారులకు సహకరించాలని కోరారు. సమావేశంలో బాపట్ల ఎక్సైజ్ సీఐ గీతిక పాల్గొన్నారు.

'వెలిగొండ' నిర్వాసితులకు పరిహారమివ్వాలి

- వెలిగొండ ప్రాజెక్టు ప్రాంతంలో రైతుసంఘం బృందం పర్యటన

వెలిగొండ ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటిస్తున్న రైతుసంఘం నేతలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వెలిగొండ నిర్వాసితులకు వెంటనే పరిహారం అందజేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రకాశం జిల్లా కమిటీ ప్రతినిధి బృందం వెలుగొండ ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించారు. వెలుగొండ ప్రాజెక్టు సుంకేసుల గ్యాప్‌ను, శ్రీశైలం డ్యాం నుంచి నీరు ప్రాజెక్టుకు నీరు వచ్చే సొరంగ మార్గాలను పరిశీలించారు. ముంపుకు గురి అయ్యే ప్రాజెక్టు రిజర్వాయర్ ప్రాంతాలను కూడా పరిశీలించారు. నిర్వాసితులను అక్కడ పరిస్థితులను గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు పరిధిలో దాదాపు 7500 మంది నిర్వాసితులు ఉంటే ఇప్పటికీ 25 మందికి మాత్రమే ప్యాకేజీ ఇవ్వటం జరిగిందని చెప్పారు. దాదాపు 11 గ్రామాల నిర్వాసితుల సమస్యలను గురించి ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం ఏ మాత్రం సరైనది కాదన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ నిర్వాసితులను పూర్తిస్థాయిలో న్యాయం జరిగే విధంగా నష్ట పరిహారాలు చెల్లించాలన్నారు. ఆ గ్రామాలను ఖాళీ చేయించడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులను ఖాళీ చేయించడానికి ప్రాముఖ్యత ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రాజెక్టు సొరంగ మార్గాలను పరిశీలించిన ▶ 2లో

సవాల్‌గా ఇసుక సమస్య

(మొదటిపేజీ తరువాయి)

ఎస్పీ దామోదర్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఇసుక సరఫరాపై మాట్లాడారు. ఇసుక విధానంపైనా, ఇసుక ధరలపైనా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోంది. దీన్ని తగ్గించే యత్నం కోసం జిల్లా ఉన్నతాధికారులు ఇద్దరూ స్పందించారని తెలుస్తోంది. ఇప్పటివరకూ 62,291 మెట్రిక్‌టన్నుల ఇసుకను ఉచిత పాలసీ కింద అందజేశామని కలెక్టర్ ప్రకటించారు. జిల్లాలో స్థానిక అవసరాల కోసం 285 వాగులు, వంకలను గుర్తించడం జరిగిందన్నారు. వాస్తవానికి వాగులు, వంకల నుంచి సామాన్యులు ఇసుక తెచ్చుకునే పరిస్థితి లేదు. టైరుబండిపై తెచ్చుకోవాలి. అప్పుడే ఉచితంగా వస్తుంది. ఇప్పుడు టైరుబండ్లు లేవు. అందరూ ట్రాక్టర్లపైనే ఆధారపడుతున్నారు. ట్రాక్టర్ వెళ్లి ఇసుక తెస్తే పోలీసులు పట్టుకుంటారు. అధికారపార్టీ నేతలకు తెలియకుండా ఎక్కడనుంచి తెచ్చినా ఇంటికి చేరడం కష్టంగా మారింది. ఎవరైనా కొనాల్సిందే.. అదే జరుగుతోంది. ఇక కడప, కర్నూలు జిల్లాల నుంచి ఇసుకను తెప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నారు. అక్కడ నుంచి తెచ్చే ఇసుక గతంలోనూ నిర్మాణాలకు పనికిరాలేదు. దాన్ని తెచ్చి నిర్మాణదారులకు అంటగట్టినా నష్టమేనంటున్నారు. ఇప్పటినుంచీ వచ్చే మార్చి వరకూ జిల్లాలో 4.36 లక్షల మెట్రిక్‌టన్నులు ఇసుక అవసరమని అంచనా వేశారు. ప్రస్తుతం నెల్లూరు జిల్లా కరేడు, దప్పలంపాడు ప్రాంతాల నుంచి రీచ్‌లు నుంచి 2.26 లక్షల మెట్రిక్‌టన్నుల ఇసుక అందుబాటులో ఉంటుందని కలెక్టర్ ప్రకటించారు. ఇక ఆన్‌లైన్ విధానం సులభతరంగా లేదు. బుక్ చేసుకుంటే ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు. ఎలాంటి ఇసుక వస్తుందో స్పష్టత లేదు. దీంతో బహిరంగ మార్కెట్‌లోనే అధిక ధరలు పెట్టి ఇసుక కొంటున్నారు. తక్కువ ధరకు వచ్చినా నాణ్యత లేకుంటే కట్టుకునే ఇల్లుపైనా ఆందోళన తప్పదు. ఏదేమైనా ఇసుక ఇప్పుడు అటు ప్రభుత్వానికి, ఇటు అధికారులకూ సవాలుగానే మారింది. ఇసుకపై పాలకపక్ష దందాను తప్పిస్తే ఇసుక గతంలో మాదిరిగా జనానికి అందుబాటులోకి వస్తుంది. ఆ పని చేస్తేనే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.

'వెలిగొండ' నిర్వాసితులకు పరిహారమివ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

సందర్భంగా అక్కడ ఉన్న పరిస్థితులను పరిశీలించారు. ప్రాజెక్టు పనులు పూర్తిగా ఆగిపోయి ఉన్నాయని ప్రభుత్వం నిధులు కేటాయించి వెంటనే ప్రాజెక్టు పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కరువు వలన బోర్లు ఎండిపోయి లక్ష రూపాయలు ఖర్చుపెట్టి అప్పుల పాలై ప్రతిరోజు రైతులు ఆత్మహత్యలు కొనసాగుతూ ఉన్న ఈ ప్రభుత్వాలకు ప్రాజెక్ట్ పూర్తి చేయాలి అనే సంకల్పం లేకపోవటం చాలా దురదృష్టకరమని, 40 సంవత్సరాల నుంచి ఈ ప్రాజెక్టును పూర్తి చేయలేకపోవడం చాలా అన్యాయమన్నారు. ఎంతో కీలకమైన ఈ ప్రాజెక్టుకు రెండువేల కోట్లు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలన్నారు. ఆ విధంగా చేయని ఎడల నిర్వాసితులను రైతాంగాన్ని సమీకరించి పోరాటాలు చేయవలసి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జుజ్జూరి జయంతిబాబు, కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు షేక్ బాబు, రైతు సంఘం జిల్లా నాయకులు దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి, రాజాకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-సిఎస్‌పురం

మండలంలో భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కనిగిరి ఆర్‌డిఒ జి కేశవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పెద్దగోగులపల్లి గ్రామంలో పంట ఇ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి సిబ్బందితో సమావేశమయ్యారు. మండలంలో రెవెన్యూపరంగా సిబ్బంది ఏ సమస్య వచ్చినా తక్షణమే పరిష్కరించే విధంగా ఉండాలన్నారు. ఎక్కువగా భూ సమస్యలు ఉన్నాయని వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మంజునాథరెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆ రోడ్డుపై ప్రయాణం నరకమే

అధ్వానంగా వి బైలు రహదారి

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

మండలంలోని వి బైలు గ్రామానికి వెళ్లే రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా ఉందని వాహనదారులు వాపోతున్నారు. గణేశనపల్లి గ్రామం నుంచి వి బైలు గ్రామం వరకు దాదాపు 6 కిలోమీటర్ల దూరం ఉన్న ఈ రోడ్డు మొత్తం తారు లేచిపోయి, కంకరతేలి, గుంటలమయమై అధ్వానంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దాదాపు 15 సంవత్సరాల క్రితం ఈ రోడ్డును తారు రోడ్డుగా మలిచారు. అప్పటినుంచి ఈ రోడ్డు గురించి పట్టించుకున్న నాథుడు లేడు. చెన్నపునాయునిపల్లి, వెదుళ్లపల్లి, వి బైలు, మైలుచర్ల గ్రామాల ప్రజలు మండల కేంద్రమైన సిఎస్ పురం రావాలంటే ఈ రోడ్డుపై ప్రయాణించాల్సి ఉంది. ఎటువంటి చిన్న పని పడినా ఈ గ్రామాల ప్రజలు గణేశనపల్లికి రావాల్సి ఉంది. రోడ్డు మొత్తం అధ్వానంగా ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు అధ్వానంగా ఉండడంతో తమ వాహనాలు ఎక్కువగా మరమ్మతులకు గురవుతున్నాయంటూ ద్విచక్ర వాహనదారులు, ఆటోల యజమానులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించి ఇబ్బందులు తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

అధ్వానంగా ఉన్న రహదారి

అధ్వాన రహదారితో ఇబ్బంది పడుతున్నాం

షేక్ రజాక్, ఆర్ఎంపి వైద్యుడు, చెన్నాపునాయునిపల్లి

ద్విచక్ర వాహనంపై గ్రామాలలో తిరుగుతూ వైద్యం చేస్తూ జీవనం సాగిస్తున్నాను. రోడ్డు అధ్వానంగా ఉండటంతో తీవ్ర ఇబ్బందిగా ఉంది. ద్విచక్ర వాహనం కూడా ఎక్కువగా రిపేర్లు వస్తున్నాయి. రోడ్డును బాగు చేసి ఇబ్బందులు తీర్చాలి.

చినుకు పడితే చిత్తడే

బురదమయమైన పోలీస్ స్టేషన్ రోడ్డు

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ఎక్కడ నీరు అక్కడే నిల్వ ఉండటంతో ఈగలు, దోమలు ఇబ్బడిముబ్బడిగా తయారయ్యాయి. దీంతో రాత్రులు కునుకుతీయాలంటే కష్టంగా ఉందని ఆయా గ్రామస్తులు అంటున్నారు. సైడ్ కాల్వలు ఏర్పాటు చేయకపోవడంతో నీరుపోయే మార్గం లేక రహదారులలో నీరు నిల్వ ఉంటున్నాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు అంటున్నారు. స్థానిక పాత పోలీస్ స్టేషన్ బజారు బురదతో మాగాణిని తలపిస్తోంది. సైడ్ కాలువలు లేకపోవడంతో నీరు పోయే మార్గం లేక రహదారి మధ్యలో నీరు నిలిచిపోయింది. మండల కేంద్రంలోనే ఇలా ఉంటే గ్రామాల్లో పరిస్థితి ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయా గ్రామాలను సందర్శించి తగు చర్యలు చేపట్టి పరిస్థితిని మెరుగు పరచాలని కోరుతున్నారు.

పర్మిషన్ లేకుండా బాణాసంచా అమ్మితే చర్యలు

ప్రజాశక్తి-పామూరు: ప్రభుత్వం పరిమిషన్ లేకుండా బాణాసంచా అమితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పామూరు ఎస్ఐ అశోక్ బాబు తెలిపారు. ఎవరైనా షాపులు పెట్టుకోవాలంటే ప్రభుత్వ అనుమతి అవసరమని, పర్మిషన్ తీసుకోవాలని సూచించారు. పర్మిషన్ లేకుండా అక్రమంగా నిర్మించిన నివాస ప్రాంతంలో బాణాసంచా నిల్వ ఉంచిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాణాసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-సిఎస్‌పురం: రాబోయే దీపావళి పండుగకు బాణాసంచా విక్రయించాలంటే అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ ఆర్ సుమన్ తెలిపారు. దీపావళి పండుగకు గ్రామాల్లో ఎక్కడైనా అక్రమంగా షాపులు పెట్టి బాణసంచా విక్రయించినట్లయితే అట్టివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. షాపులు నిర్వహించుకుంటే తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు.

ఇన్‌చార్జి ఎంపిడిఓగా సుందరరామయ్య

ప్రజాశక్తి-దర్శి: తాళ్లూరు ఇన్‌చార్జి ఎంపిడిఓగా కె సుందరరామయ్యను నియమిస్తూ జిల్లాపరిషత్ సిఇఓ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఎఓ సత్యంకు బాధ్యతలు తప్పించి ఇఓఆర్‌డిగా పనిచేస్తున్న సుందరరామయ్యకు ఎంపిడిఓగా బాధ్యతలు ఇచ్చారు.

డాక్యుమెంట్లు పోయినవి

బాపట్ల జిల్లా జె. పంగులూరు మండలం కోటపాడు గ్రామానికి చెందిన నాలి నాగార్జున తండ్రి వీరాంజనేయులకు చెందిన స్థలముకు సంబంధించిన సర్వే నెంబరు 395, ఒరిజినల్ రిజిస్టర్ దస్తావేజులు నెంబరు 4578/2023 జిరాక్సుల నిమిత్తం 22-9-2024 తేదీన కోటపాడు నుండి జె. పంగులూరు మండల కేంద్రానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా సదరు డాక్యుమెంటుకు సంబంధించిన ఫైల్ పోయినది. దొరికినవారు ఈ దిగువ చిరునామాకు తెలియజేయగలరు.

ఇట్లు
నాలి నాగార్జున
తండ్రి వీరాంజనేయులు
కోటపాడు(గ్రామం),
జె.పంగులూరు (మండలం), బాపట్ల జిల్లా,
సెల్ : 8501869346

మహారాజశ్రీ మార్కాపురం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్. నెం: 143/2024

గార్లపాటి మరియమ్మ ...వాది

వర్సెస్

గార్లపాటి జయరావు ...ప్రతివాది

టు,
గార్లపాటి జయరావు, తండ్రి: చినశీ లింగయ్య
నివాసం: పెద్దగుడిపాడు (అమానిగుడిపాడు)
యర్రగొండపాలెం మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాను వాది, ప్రతివాదిపై ప్రామిసరీ నోటు బాకీ నిమిత్తం దాఖలు చేయగా, ఎన్ని పర్యాయములు సమన్లు జారీ చేసిననూ నీకు ముట్టని కారణం చేత కోర్టు వారు పేపరు ప్రకటన కొరకు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున తేదీ: 21-10-2024న ఉదయం 10:30 గంటలకు నీవు స్వయముగా కానీ, మీ వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందున కేసు తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వులతో)

వాయిదా: 21-10-2024

మార్కాపురం **టి. వెలుగొండయ్య,**
అడ్వకేట్, మార్కాపురం.

మహారాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
హెచ్.ఎం.ఓ.పి. నెం: 46/2024

దొంగరి సౌజన్య ... పిటీషనర్

వర్సెస్

దొంగరి సత్యనారాయణ ...రెస్పాండెంట్

టు,
దొంగరి సత్యనారాయణ, తండ్రి: చిన్న గాలెయ్య
నివాసం: 1-82ఎ, నల్లగుంట్ల గ్రామం,
పెద్దదోర్నాల మండలం, ప్రకాశం జిల్లా.

పైన తెలిపిన పిటీషనర్, రెస్పాండెంట్ నుండి విడాకులు కోరుతూ శ్రీయుత సీనియర్ సివిల్ జడ్జి, మార్కాపురం కోర్టు నందు డైవర్స్ పిటీషన్ ఫైల్ చేసినారు. ఇందు విషయమై రెస్పాండెంట్‌కి ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ ముట్టలేదు. కోర్టు వారి ఆదేశాలలో పేపరు ప్రకటన ద్వారా నోటీసు జారీ చేయడమైనది. నీకు ఎటువంటి ఆక్షేపణలున్న యెడల తేదీ: 18-10-2024 ఉదయం 10 గంటలకు స్వయముగా గానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టు నందు హాజరై మనవిచేసుకోవలసినది. లేని యెడల సదరు విషయమై నీ పరోక్షమందు తీర్మానము చేయుదురని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా: 18-10-2024

మార్కాపురం **టి. వెలుగొండయ్య**
అడ్వకేట్, మార్కాపురం.

మహారాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్. 18/2024

బిజినేపల్లి లక్ష్మి నరసింహారావు ...వాది

వర్సెస్

మంచికంటి వెంకట రంగ సుబ్బరాయుడు ..ప్రతివాది

టు,
మంచికంటి వెంకట రంగ సుబ్బరాయుడు
తండ్రి: శ్రీనివాసరావు, వయసు 41 సం॥, హిందూ,
వ్యాపారం, డోర్ నెం: 6/41, నక్కా వారి వీధి,
బేస్తవారిపేట గ్రామం, (పోస్టు మరియు మండలం),
ప్రకాశం జిల్లా.

ఈ నెంబరు వాది దావా ప్లెయింట్ పరిహారం రాబట్టుకొను నిమిత్తం దాఖలు చేసియున్నారు. నీకు ఎన్ని పర్యాయములు దావా సమన్లు పంపిననూ ముట్టని కారణం చేత పేపరు ప్రకటన కొరకు కోర్టు వారు ఆర్డర్ వేసియున్నారు. పై దావాలో నీ ఆక్షేపణలు వినుటకు 05-11-2024వ తేదీకి వాయిదా వేయడమైనది. ఆ రోజు ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట నీవు స్వయముగా గానీ, అడ్వకేట్ గారి ద్వారా గానీ హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల నీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా: 05-11-2024

ఇట్లు
తడికమళ్ల శివప్రసాద్, బి.ఎస్.సి., ఎల్.ఎల్.బి.,
వాది తరపు అడ్వకేట్,
మార్కాపురం.

జనరల్ నోటీసు
మహారాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
సక్సేషన్ ఓ.పి. నెం: 11/2014

షేక్ సలీమా ...పిటీషనరు

వర్సెస్

నిల్ ...రెస్పాండెంట్

పిటీషనరు పై నెంబరు ఎస్.ఓ.పి. పిటీషన్‌ను తన భర్త అయిన లేట్ షేక్ అబ్దుల్ రవూఫ్ గారు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేసి రిటైర్డ్ అయిన తరువాత పిటీషనరును 2వ భార్యగా పెళ్లి చేసుకొనినారు. 30-06-2020న పిటీషనరు భర్త అనారోగ్యంతో చనిపోయినందున, తన భర్త మరణానంతరం ఫ్యామిలీ పెన్షన్ పొందుటకు పిటీషనరును వారసులుగా డిక్లేర్ చేసి సక్సేషన్ సర్టిఫికెట్ కొరకు పై ఎస్.ఓ.పి. ని సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో పిటీషన్‌ను దాఖలు చేసియున్నారు. ఇందు విషయమై ఎవరికైనా ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల 01-11-2024వ తేదీన ఉదయం 10:30 గంటలకు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై కోర్టు వారితో మనవి చేసుకొనవలసినది. లేని యెడల ఇందు విషయమై మీ పరోక్షమున విచారించి తీర్మానం చేయబడునని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వులతో)

వాయిదా: 01-11-2024

షేక్ షహనాజ్ బేగం,
పిటీషనర్ తరపు అడ్వకేట్
మార్కాపురం.

మద్యం టెండర్లపై పుకార్లు నమ్మొద్దు

మీడియా సమావేశంలో ఏఈఎస్ బాలయ్య

ప్రజాశక్తి- మార్కాపురం రూరల్

మద్యం టెండర్లపై పుకార్లు నమ్మొద్దని ఏఈఎస్ దాసరి బాలయ్య పేర్కొన్నారు. స్థానిక తర్లుపాడు రోడ్డులోని ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఈఎస్ బాలయ్య మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం పాలసీలో సిండికేట్ వ్యాపారస్తుల నుండి నూతనంగా దరఖాస్తు చేసుకునే వారికి ఎలాంటి బెదిరింపులకు తావు లేదన్నారు. మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసే విషయంలో ఎలాంటి అపోహలు వద్దన్నారు. ఈ నూతన మద్యం పాలసీని విజయవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకున్నదన్నారు. ఎవరికైనా

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఈఎస్ బాలయ్య

షాపు దక్కితే ప్రశాంతంగా వ్యాపారం చేసుకోవచ్చునన్నారు. ప్రస్తుతం నూతన మద్యం పాలసీ టెండర్లను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో చేసుకోవచ్చు అన్నారు. కేవలం ఐదు నిమిషాల్లో టెండర్లు వెయ్యవచ్చునని, గతంలో మద్యం వ్యాపారం చేసిన వాళ్ళ వారి స్వార్థం కోసం టెండర్లపై అపోహలు సృష్టిస్తున్నారన్నారు. పుకార్లు పుట్టించినవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈనెల 14న కలెక్టర్ ఆధ్వర్యంలో నిష్పక్షపాతంగా లాటరీ తీయడం జరుగుతుందన్నారు. ఒక్కో షాపు ఏరియాలలో 10 అప్లికేషన్లలోపు వస్తే రీ నోటిఫికేషన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం జనాభాను ప్రామాణికంగా తీసుకొని ప్రభుత్వం అనుకున్న మేరకు టెండర్లు వేసేందుకు గుత్తేదారులకు ముందుకు రాని ఎడల అక్కడ ఇంటలిజెన్స్ నిఘా వ్యవస్థతో సమాచారం సేకరించి ఎవరైనా గుత్తేదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తేలితే తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం సబ్ డివిజన్ స్వాడ్ ఎండి గౌస్ బాషా, మార్కాపురం ఎక్సైజ్ స్టేషన్ సీఐ ముక్కు వెంకటరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు

అక్రమంగా నిల్వ ఉంచిన టపాసులు సీజ్

2 చోట్ల రూ.3.5 లక్షల విలువైన క్రాకర్స్ పట్టివేత

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన టపాసులను గురువారం సాయంత్రం మార్కాపురం పోలీసులు సీజ్ చేశారు. స్థానిక తర్లుపాడు రోడ్డులోని డిఎస్పీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మార్కాపురం డీఎస్పీ యూ.నాగరాజు వివరాలు వెల్లడించారు. మార్కాపురం పట్టణ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.సైదా బాబుకు వచ్చిన సమాచారం మేరకు, తన సిబ్బందితో కలిసి ఎస్టేట్‌లోని నరసింహా రావు ప్లాస్టిక్ గ్రానువల్స్ పేరు గల గోడౌన్‌లో తనిఖీ చేశారు. అక్కడ సుమారు రూ.1.5 లక్షల విలువైన దీపావళి క్రాకర్స్‌ను చిలకలూరిపేటలోని లక్ష్మి క్రాకర్స్ గోడౌన్ నుంచి మార్కాపురం పట్టణానికి చెందిన జ్వలిత్ అనే వ్యక్తి కొనుగోలు చేసి, మార్కాపురంలోని తన గోడౌన్‌లో అక్రమంగా నిల్వ ఉంచారు. వీటిని ఎక్కువ ధరకు ప్రజలకు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో అక్రమంగా నిల్వ ఉంచి అధిక ధరలకు ప్రజలకు విక్రయిస్తున్నందున జ్వలిత్‌పై కేసు నమోదు చేసి, గోడౌన్ నుండి దీపావళి క్రాకర్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా గురువారం ఉదయం మార్కాపురం పట్టణ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.సైదు బాబు తన సిబ్బందితో కలిసి, ఎస్టేట్ వై జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎస్టేట్ వైపు నుంచి మార్కాపురం పట్టణంలోకి వస్తున్న ఆటోలో సుమారు రూ.2 లక్షల విలువ గల దీపావళి క్రాకర్స్‌ను పట్టుకున్నారు. వీటిని మార్కాపురం పట్టణానికి చెందిన రమాకాంత్ అనే వ్యక్తి కొనుగోలు చేసి, వాటిని అక్రమంగా మార్కాపురం పట్టణానికి తీసుకొని వచ్చి అధిక ధరలకు ప్రజలకు విక్రయించటకు తన ఆటోలో తీసుకు వస్తున్నట్లు ఆటో డ్రైవర్ అయిన బాషా చెప్పారు. డ్రైవర్ బాషాను, ఆటోతో పాటు అందులో ఉన్న దీపావళి క్రాకర్స్‌ను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా టపాసులను నిల్వ ఉంచుకొని విక్రయాలు జరిపితే వారి పట్ల కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారావు, ఎస్ఐ ఎం.సైదా బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుండ్లాపల్లిలో చోరీ

ప్రజాశక్తి-మద్దిపాడు

మండల పరిధిలోని గుండ్లాపల్లిలోనీ ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జాతీయ రహదారి పై ఓవర్ పక్కన ఓ ఇంట్లో చోరీ జరిగిందన్న సమాచారం మేరకు ఎస్ఐ శివరామయ్య ఘటనా స్థలాన్ని గురువారం పరిశీలించారు. 19 గ్రాముల బంగారం, రూ.40 వేలకు పైగా నగదు చోరీకి గురైనట్లు సమాచారం. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివరామయ్య తెలిపారు.

ఎస్ఐని కలిసిన మహిళా పోలీసులు

ప్రజాశక్తి-పొన్నలూరు

పొన్నలూరు మండల నూతన ఎస్సైగా అనూక్ ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో ఆయనను గురువారం మండలంలోని అన్ని సచివాలయ మహిళా పోలీసులు పుష్పగుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరిగితే వెంటనే సమాచారం అందించాలని తెలిపారు.

మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ విజయ

రాజకీయాలకతీతంగా మద్యం దుకాణాలకు టెండర్లు

అసిస్టెంట్ కమిషనర్ విజయ

ప్రజాశక్తి-పొదిలి

రాష్ట్రంలో జరుగుతున్న మద్యం టెండర్ల విషయంలో రాజకీయాలకు అతీతంగా పని చేస్తున్నామని జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ అన్నారు. మద్యం పాలసీలో విధి విధానాలపై గురువారం పొదిలి ఎక్సైజ్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన ఆమె మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసే విషయంలో ఎలాంటి అపోహలు, బెదిరింపులకు ఆస్కారం లేదన్నారు. ఈ మద్యం పాలసీని విజయవంతం చేసేందుకు అవసరమైన చర్యలను రాష్ట్ర ప్రభుత్వ తీసుకుంటుందన్నారు. నూతన పాలసీలో షాపు దక్కిన వారు ఎటువంటి రాజకీయ ఒత్తిడిలు లేకుండా, సిండికేట్‌కి అవకాశం ఇవ్వకుండా ప్రశాంతంగా వ్యాపారం చేసుకోవచ్చన్నారు. నూతన మద్యం దుకాణాలు ప్రారంభించిన తరువాత బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జనార్దన్ రావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు నరహరి, రామారావు, పొదిలి ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అరుణ్ కుమారి, సబ్ ఇన్‌స్పెక్టర్ సైమన్లు పాల్గొన్నారు.

అర్హులకు రుణాలు మంజూరు చేయాలి

మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్య

ప్రజాశక్తి-చీమకుర్తి

అర్హులైన లబ్ధిదారులకు రుణాల మంజూరు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టౌన్ లెవల్ బ్యాంకర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలుపరిచే వివిధ పథకాలకు అర్హులైన లబ్ధిదారులకు రుణాలు త్వరితగతిన మంజూరు చేయాలని తెలిపారు. వీధి వ్యాపారులకు, పిఎం విశ్వకర్మ పథకానికి దరఖాస్తు చేసుకున్న వారికి త్వరగా రుణాలు మంజూరు చేయాలని కోరారు. పొదుపు సంఘాలకు రుణాల గురించి బ్యాంకర్లను అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిగత యూనిట్లు నెలకొల్పే వారికి స్వయం ఉపాధి పథకం ద్వారా వడ్డీ రాయితీతో బ్యాంకుల ద్వారా రుణాలు అందించడం జరుగుతుందన్నారు. బ్యాంకుల నుంచి తీసుకున్న అన్ని

మాట్లాడుతున్న కమిషనర్ రామకృష్ణయ్య

రుణాలు రికవరీలో పూర్తి సహకారం అందించాలని, తీసుకున్న రుణాలు సక్రమంగా బ్యాంకుల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సిటీ మిషన్ మేనేజర్ కె.రఘు, స్టేట్ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ సునీత, ఆంధ్రప్రగతి బ్యాంకు ఫీల్డు ఆఫీసర్ మదన్, కోఆపరేటివ్ బ్యాంకు మేనేజర్ సంపత్ కుమార్, కమ్యూనిటీ ఆర్గనైజర్ పి.రాజేశ్వరి, డిఈఓ చిరంజీవి, అఖిల పాల్గొన్నారు.

మహిళాసంఘాల అభివృద్ధికి కృషి

ఏపీఎంగా కోటేశ్వరరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-పొదిలి

మర్రిపూడి మండలంలో మహిళా సంఘాల అభివృద్ధికి కృషి చేస్తానని నూతన ఏపీఎంగా బాధ్యతలు చేపట్టిన ఎల్.కోటేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక స్త్రీ శక్తి భవనం వెలుగు కార్యాలయంలో ఏపీఎం కోటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో మొత్తం 1022 గ్రూపులు, 30 గ్రామ సంఘాలు ఉన్నాయన్నారు. బ్యాంకు లింకేజీ టార్గెట్ రూ.25 కోట్లుకు గాను ఇప్పటివరకు రూ.15 కోట్లు రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు.

మాట్లాడుతున్న కోటేశ్వరరావు

అదే విధంగా స్త్రీనిధి రూ.4 కోట్ల లక్ష్యం కాగా రూ.2 కోట్లు రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఉన్నతి స్కీంలలో ఎస్‌సి, ఎస్‌టి, సబ్ ప్లాన్ ఎస్‌సి, ఎస్‌టిలోని గ్రూపు సభ్యులకు రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రూపులు ఏ-గ్రేడ్‌లో రావటటానికి అన్ని రుణాలు వందశాతం రికవరీ చేయటానికి కృషి చేస్తానని తెలియజేశారు.

హైవేపై హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు వద్ద ఎస్ఐ

ప్రజాశక్తి-మద్దిపాడు

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై శివరామయ్య తెలిపారు. నేషనల్ హైవేపై గురువారం ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంగోలు నుంచి గుంటూరు వెళ్లే నేషనల్ హైవేపై ముఖ్యమైన జంక్షన్‌లలో ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. వాహనాలను నడిపేటప్పుడు ప్రతి ఒక్కరు జాగ్రత్తలు వహించాలన్నారు. అతి వేగంతో వాహనాలు నడిపి ప్రాణాలను పోగొట్టుకోవద్దని సూచించారు. అదేవిధంగా ఫేస్‌వాష్ కార్యక్రమాన్ని కూడా చేపడుతున్నట్లు తెలిపారు. అర్ధరాత్రి రెండు గంటల నుండి నాలుగు గంటల వరకు హైవేపై వెళ్లే వాహనాలను ఆపి డ్రైవర్లకు ముఖం కడిగించి వారిని నిద్రమత్తు నుండి లేపి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

బస్సు డ్రైవర్‌కు నీళ్లు ఇస్తున్న పోలీసులు

రికార్డులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకట దాసు

సచివాలయంలో తనిఖీ

ప్రజాశక్తి - గిద్దలూరు

నగర పంచాయతీలోని నంద్యాల రోడ్డు సచివాలయంలో గురువారం మున్సిపల్ కమిషనర్ వెంకట దాసు తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరు రికార్డును పరిశీలించారు. సిబ్బందిపై ప్రజల నుండి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా చర్యలు తప్పవని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని తెలిపారు. అలాగే సచివాలయ పరిధిలో ఇంటి పన్నులు, నీటి పన్నుల వసూలుకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టభద్ర ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభించిన యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్

కావటి నారాయణ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - బాపట్ల

వచ్చే ఏడాది ఫిబ్రవరి లేదా మార్చిలో జరుగనున్న పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటర్లుగా నమోదు చేసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ విలేకరులకు గురువారం తెలిపారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. 2007 నుండి పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ఫోరంగా ఏర్పడి గెలిచిన ఎంఎల్‌సిలు అందరూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ప్రజాతంత్ర హక్కులను కాపాడేందుకు అత్యంత నిజాయితీతో పని చేశారని అన్నారు. ప్రస్తుతం గుంటూరు, కృష్ణ పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల సర్టిఫికెట్, నివాస ధ్రువీకరణ పత్రం, ఫోటో తప్పనిసరిగా జతచేసి స్థానిక తహాశీల్దారు కార్యాలయంలో అందజేయాలని అన్నారు. మరింత సమాచారం కోసం గుంటూరు, కృష్ణ ఉమ్మడి జిల్లాల యుటిఎఫ్ కార్యాలయంలో అప్లికేషన్లు, ఆన్లైన్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అర్హత కలిగిన పట్టభద్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. తొలుత నమోదుకు ఎన్నికల కమిషన్ అవకాశం ఇచ్చిందని తెలిపారు. 2021 అక్టోబర్ 31లోపు డిగ్రీ లేదా డిప్లొమా పొందిన వారందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. 2024 నవంబరు 6లోపు ఆఫ్ లైన్, ఆన్లైన్లో నమోదు చేసుకోవచ్చని అన్నారు. ఫారం 18 ద్వారా నమోదు చేసుకునేటప్పుడు ఆధార్ కార్డు, డిగ్రీ లేదా డిప్లమా యుటిఎఫ్, ఎస్‌టిఎఫ్ఐ సీనియర్ నాయకులు కామ్రేడ్ నాగటి నారాయణ ద్వితీయ వర్ధంతి సందర్భంగా నారాయణ చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కె శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె వినయ్ కుమార్, అడుగుల శ్రీనివాసరావు, సహాధ్యక్షులు బి బిక్షాలుబాబు, కోశాధికారి ఎం వెంకటేశ్వరరెడ్డి, జిల్లా కార్యదర్శులు పి రామాంజనేయులు, సిహెచ్ చెంచయ్య, భవనం శ్రీనివాసరెడ్డి, మద్దాల సురేష్, పాలేరు సురేష్, బి వినోద్ కుమార్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు పాల్గొన్నారు.

ఓటరు నమోదును ప్రారంభిస్తున్న యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు

శాంసంగ్ కార్మికులకు సిఐటియు మద్దతు

ప్రజాశక్తి - చీరాల

తమిళనాడులోని శ్రీ పెరంబుదూర్ సామ్సంగ్ ఇండియా ప్లాంట్‌లోని కార్మికుల పోరాటానికి మద్దతుగా స్థానిక ఐఎల్‌టిడి కంపెనీ ఫెడరేషన్ (సిఐటియు) గురవారం సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం వసంతరావు మాట్లాడారు. సాంసంగ్ వార్షిక ఆదాయం 12బిలియన్ డాలర్లు ఉందని అన్నారు. రూకోట్ల లాభాలు చేకూరుస్తున్నప్పటికీ కార్మికుల పట్ల యాజమాన్యం మొండి వైఖరి చూపుతూ పక్షపాత ధోరణి విడనాడి చర్చలు జరపి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సాంసంగ్ కార్మికులకు దేశవ్యాప్తంగా కార్మిక వర్గం సంఘీభావంగా నిలబడిందని అన్నారు. మరో వైపు కేంద్ర ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ పేరుతో కార్మిక చట్టాలను మారుస్తుందని అన్నారు. కార్మికులను బానిసలుగా చేసే ఈ చట్టాల మార్పుకు వ్యతిరేకంగా పోరాడుతూ సాంసంగ్ కార్మికుల సమస్య పరిష్కారం అయ్యేదాకా అండగా ఉంటుందని ఫెడరేషన్ ఉంటుందని ఫెడరేషన్ నాయకులు జి సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు నక్కల సాంబశివరావు, చప్పిడి భాస్కర్, ఎం సత్యమూర్తి, కోరినపాటి వెంకట్రావు, సిహెచ్ రమేష్, చెల్లి లక్ష్మయ్య పాల్గొన్నారు.

సాంసగ్ కార్మికులకు మద్దతుగా ఐఎల్‌టిడి ఫెడరేషన్ కార్మికులు

పారదర్శకంగా మద్యం టెండర్లు

ప్రజాశక్తి - రేపల్లె

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న మద్యం పాలసీని పారదర్శకంగా అమలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు తెలిపారు. పట్టణంలోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో టెండర్ల ప్రక్రియను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో 3 షాపులు, రూరల్ పరిధిలో 4 షాపులు, భట్టిప్రోలు మండలంలో 5 షాపులు కలిపి 12 షాపులకు, నగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలోని నగరం పరిధిలో 3 షాపులు, నిజాంపట్నం మండలంలో 4 షాపులు, చెరుకుపల్లి మండలంలో 5 షాపులకు మొత్తం 12 షాపులకు టెండర్ల ప్రక్రియ నడుస్తుందని అన్నారు. ఈనెల 11సాయంత్రం ఏడు గంటల వరకు టెండర్ల ప్రక్రియ స్వీకరించనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు రేపల్లె నగరం పరిధిలో 24 షాపులకు 200 మందికిపైగా టెండర్లు వేసినట్లు చెప్పారు. టెండర్లను వేయాల్సిన వారు ఆఫ్ లైన్, ఆన్ లైన్ విధానంలో 11వ తేదీ సాయంత్రం వరకు దరఖాస్తు చేయవచ్చని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 1800పైగా దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. టెండర్ల ప్రక్రియ ముగిసిన వెంటనే ఈనెల 12న కలెక్టర్ కార్యాలయంలో లాటరీ పద్ధతిలో షాపుల టెండర్లను తీయనున్నట్లు తెలిపారు. ప్రతి దరఖాస్తుదారుడు రూ.2లక్షల డిపాజిట్ చెల్లించి టెండర్లలో పాల్గొనవచ్చని తెలిపారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా మద్యం షాపుల విషయంలో అధికార యంత్రాంగం పారదర్శకంగా ఎంపికి ప్రక్రియ చేపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఆర్ దివాకర్, ఎస్ఐ రాజశ్రీ పాల్గొన్నారు.

సమావేశంలో ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు

స్వర్ణ కార్యదర్శిగా చక్రవర్తి

ప్రజాశక్తి - కారంచేడు

ఎన్ఆర్‌విపి చక్రవర్తి

మండలంలోని స్వర్ణ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా ఎన్ఆర్‌విపి చక్రవర్తి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయితీ అభివృద్ధి చేయడంలో అందరి సహకారంతో కృషి చేస్తానని చెప్పారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగుర్చడానికి కృషి చేస్తానని అన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలన్నీ పరిష్కారం చేస్తానికి నాయకుల సహకారంతోపాటు ఉన్నత అధికారుల సహకారంతో కృషి చేస్తానని చెప్పారు.

రతన్ టాటా మరణం తీరని లోటు

ప్రజాశక్తి - బాపట్ల

రతన్ టాటా మరణం దేశానికి తీరని లోటని మాజీ ఎంఎల్‌సి అన్నం సతీష్ ప్రభా కర్ అన్నారు. గురువారం మరణ వార్త తెలుసుకున్న సతీష్ ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పారిశ్రామిక రంగంలో ఆయన ఎన్నో ఆవిష్కరణలతో ఎంతో మందికి ఉపాధి కల్పించారని అన్నారు. ఆయన మరణంతో దేశం ఒక పారిశ్రామిక దిగజాన్ని కోల్పోయిందని అన్నారు. టాటా కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

నూనె కౌంటర్ ప్రారంభిస్తున్న ఆర్డీఓ అఖిల

నూనె కౌంటర్లను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - చీరాల

వంట నూనెల ధరలు అధికంగా పెరిగటంతో వాటిని నియంత్రించేందుకు ప్రభుత్వం సంబంధిత ఆయిల్ ట్రేడర్లుతో చర్చించి ధరలను నియంత్రిస్తూ ఏర్పాటు చేసిన ప్రత్యేక వంట నూనె కౌంటర్లను ప్రజల సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఒ దేవరకొండ అఖిల కోరారు. జాయింట్ కలెక్టరు ఆదేశాల మేరకు పట్టణంలో ఆయిల్ ట్రేడర్లుతో సమావేశం ఏర్పాటు చేసి స్పెషల్ కౌంటర్లు ప్రారంభించారు. వీటి ద్వారా పామాయిల్ లీటర్ రూ.115, సన్ ఫ్లవర్ రూ.125లకు విక్రయించాలని ఆదేశించారు. మండలంలో కార్తికేయ ఆయిల్ ట్రెడర్స్ నందు ఆర్‌డిఒ దేవర కొండ అఖిల, తహశీల్దారు గోపి కృష్ణ, సిఎస్ డిటిలు స్పెషల్ కౌంటర్స్ ప్రారంభించారు. పట్టణంలోని అన్ని ఆయిల్ ట్రేడర్లలో స్పెషల్ కౌంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

న్యాయవిజ్ఞాన సదస్సులో డాక్టర్ గొట్టిపాటి జయసింహ

మానసిక ఆరోగ్యం ప్రదానం

ప్రజాశక్తి - అద్దంకి

మండల న్యాయ సేవధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు గురువారం నిర్వహించారు. పట్టణంలోని గాజులపాలెంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆరోగ్య కేంద్రం డాక్టర్ గొట్టిపాటి జయసింహ, న్యాయవాదులు షేక్ మహమ్మద్ రఫీ, ఎం ప్రకాష్ మాట్లాడారు. మానసిక ఆరోగ్యం ఆవశ్యకతపై సూచనలు చేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వచనం ప్రకారం శారీరక, మానసిక, సామాజిక, భావోద్వేగంగా ఆరోగ్యంగా ఉండటమే నిజమైన ఆరోగ్యమని తెలిపారు. గర్భిణీ స్త్రీలు కౌమార దశలో ఉన్న బాల, బాలికలు, వృద్ధుల మానసిక ఆరోగ్యం సక్రమంగా ఉంటే సమాజం శాంతి సౌఖ్యాలతో ఆనందంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలు, ఆశా వర్కర్లు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వాసవీ కళ్యాణ మండపం అధ్యక్షులుగా బెల్లంకొండ

ప్రజాశక్తి - ఇంకొల్లు

వాసుదేవరావు

స్థానిక వాసవి కన్యాకా పరమేశ్వరి ఆర్యవైశ్య కళ్యాణ మండపం నూతన అధ్యక్షులుగా బెల్లంకొండ వాసుదేవరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శి, కోశాధికారి, సభ్యులను నవరాత్రి ఉత్సవాలైపోయిన అనంతరం ఎన్నుకోనున్నట్లు అధ్యక్షులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు తెలిపారు. గత ఎనిమిది రోజులుగా వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం కలశ పూజను మహిళా భక్తులు నిర్వహించారు. ఈ సందర్భంగా నగరోత్సవం నిర్వహించారు. దుర్గాదేవి అవతారంలో వాసవి మాతను అలంకరించారు.

ఫ్రీ హోల్డ్ భూములపై విచారణ

పాత గోదామును పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ సహదీత్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మార్కాపురం డివిజన్ పరిధిలో 13 మండలాల్లో ఫ్రీ హోల్డ్ భూములపై విచారణ నిర్వహిస్తున్నట్లు మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్ తెలిపారు. గురువారం ఆయన యర్రగొండపాలెంలోని తహశీల్దార్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ఫ్రీ హోల్డ్ భూములు ప్రభుత్వ నిబంధనలకు లోబడి రిజిస్టర్ చేశారా లేదా అనే వాటిపై క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అవకతవకలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిత్యం తహశీల్దార్లతో మాట్లాడుతూ ఎప్పటికప్పుడు రెవెన్యూ పరమైన సమాచారాన్ని తెలుసుకుంటున్నట్లు చెప్పారు. ప్రభుత్వ భూములను ఆక్రమించడం, కొనుగోలు చేయడం, అమ్మడం చేయరాదని తెలిపారు. గత ప్రభుత్వంలో మంజూరైన పక్కా గృహాలను డిసెంబర్ చివరి నాటికి నిర్మించుకోవాలన్నారు. లేకుంటే ఆ స్కీము రద్దయ్యే అవకాశం ఉందన్నారు. డివిజన్‌లో పలుచోట్ల నీటి సమస్య ఉన్నట్లు చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. జన్‌మన్ పథకం ద్వారా గిరిజనుల అభివృద్ధికి అవసరమైన అన్ని రకాల సర్వేలు నిర్వహించి వారికి సౌకర్యాలు అందేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయ పరిధిలో గల పాత సివిల్ సప్లై గోదామును పరిశీలించారు. దానిని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా దృష్టికి తీసుకెళ్లి మీకోసం కార్యక్రమం నిర్వహించేందుకు ఉపయోగించేలా మరమ్మతులు చేయించేలా కృషి చేస్తానన్నారు. తహశీల్దార్ కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ప్రాంగణంలో చెత్తా చెదారం కనిపించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట తహశీల్దార్ ఏ బాల కిశోర్ ఉన్నారు.

అన్నదానం చేస్తున్న దృశ్యం

85వ రోజుకి ఉచిత అన్నదానం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డొక్కా సీతమ్మ అన్నదాన కేంద్రంలో ఉచిత అన్నదాన కార్యక్రమం గురువారం 85వ రోజుకి చేరుకుంది. డొక్కా సీతమ్మ అన్నదాన కేంద్రంలో ప్రతిరోజూ ఇంటి భోజనం పేదలు, కూలీలు, విద్యార్థులకు ఉచితంగా భోజన సదుపాయాన్ని కల్పించడం సంతప్తిని ఇస్తుందని నిర్వాహకులు జడ బాల నాగేంద్రయాదవ్ తెలిపారు. ప్రతిరోజూ ఒంగోలు నగరంలో ఆకలితో ఉన్నవారికి ఉచిత భోజన సదుపాయాన్ని కల్పిస్తున్నామని, ఇందుకు సహకరిస్తూ విరాళాలు అందజేస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. మాజీ మంత్రి జనసేన నాయకులు బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నదాన కేంద్ర నిర్వహణకు సహకారం అందిస్తున్నారని తెలిపారు. జనసేన ప్రచార కమిటీ కోఆర్డినేటర్‌గా తన వంతు ఒంగోలు నగరంలో పవన్ కళ్యాణ్ ఆశయాలను, జనసేన లక్ష్యాలను నిరంతరం ప్రజల్లోని తీసుకొని వెళ్తూ ఇటువంటి సేవా కార్యక్రమాలు మరిన్ని కొనసాగించేందుకు కషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో డొక్కా సీతమ్మ అన్నదాన కేంద్రం సభ్యులు మెట్ల రామకష్ణ, కోటా సుధాకర్, పార్శ కోటయ్య, అంజి పాల్గొన్నారు.

గ్రంథాలయంలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాలలోని శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రికార్డులు పరిశీలించి సంతృప్తికరంగా ఉన్నాయని తెలిపారు. పాఠకుల మెంబర్‌షిప్పులు పెంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు డి.వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

హాస్పిటల్ సిబ్బందికి దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని శ్రీకందుల ఓబులరెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ సిబ్బందికి విజయదశమి పండుగ సందర్భంగా కంభం మాజీ ఎమ్మెల్యే కందుల నాగార్జునరెడ్డి సతీమణి ప్రమీలాదేవి మహిళలకు, పురుషులకు దుస్తులను గురువారం నాడు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్పటల్ అధినేత డాక్టర్ గౌతం నాగిరెడ్డి పాల్గొన్నారు.

రతన్‌టాటా మృతికి ఎంపీ మాగుంట సంతాపం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రముఖ టాటా సంస్థల ఛైర్మన్, పద్మ విభూషణ్ రతన్ టాటా మృతికి ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి సంతాపం తెలియజేశారు. రతన్ టాటా అనారోగ్య కారణంతో మతిచెందడం ఎంతగానో కలచి వేసిందన్నారు. ఎన్నో లక్షల మందికి జీవనోపాధి కల్పించిన గొప్ప వ్యక్తి రతన్ టాటా అని, అటువంటి గొప్ప వ్యక్తిని కోల్పోవడం బాధాకరమన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి

ఏరియా వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

ఏరియా వైద్యశాలలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్‌అన్సారియా వైద్యులకు సూచించారు. గురువారం సాయంత్రం ఆమె యర్రగొండపాలెంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలను ఆకస్మికంగా సందర్శించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఎన్‌టిఆర్ వైద్య సేవల కౌంటర్, రోగుల రిజిస్ట్రేషన్ రూములను సందర్శించి రిజిస్ట్రేషన్ రికార్డులను, స్త్రీలు, పురుషుల సర్జికల్ వార్డులు, డయాలసిస్, క్యాజువాలిటి రూములను, అత్యవసర సేవా విభాగం, కాన్పులు, పిల్లల వార్డు, నవజాత శిశు సంరక్షణ కేంద్రం, ఐటిడిఎ ప్రత్యేక వార్డు తదితర విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో వైద్య సేవలు ఎలా అందుతున్నాయి, వైద్యులు సక్రమంగా చూస్తున్నారా అని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఆసుపత్రికి కొంత భాగం కాంపౌండ్ వాల్ నిర్మించాల్సి ఉందని, అలాగే ఆసుపత్రి ఆవరణలో లెవలింగ్ చేయాల్సి ఉందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యదిద్యా ఆమె దష్టికి తీసుకెళ్లారు. పరిశీలించి చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఆమె వెంట కలెక్టర్ వెంట మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్, తహశీల్దార్ బాల కిషోర్, ఎంపిడిఓ శ్రీనివాసరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యదిద్యాతో పాటు ఇతర అధికారులు ఉన్నారు. ముందుగా ఆమె యర్రగొండపాలెంలోని పుల్లలచెరువు రోడ్డులో నూతనంగా నిర్మించిన రైతు బజారును పరిశీలించారు. రైతుబజార్ ఆవరణలో లెవలింగ్ చేయించాలని మార్కెటింగ్ శాఖ ఏడి ఉపేంద్ర కుమార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

అల్లిపాలెం చెంచుగూడెంలో వైద్యశిబిరం

కలెక్టర్ తమీమ్ అన్సారియాను సత్కరిస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండలంలోని దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో గల అల్లిపాలెం చెంచుగూడెంలో పాలుట్ల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు నాయక్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆ గూడెంలోని చెంచు గిరిజనులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. రక్తహీనతతో బాధ పడుతున్న వారికి ఐరన్ మాత్రలు, టానిక్‌లు, ప్రొటీన్ పౌడర్లు పంపిణీ చేశారు. చిన్నారులకు, గర్భిణీలకు వ్యాక్సిన్‌లు వేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, దోమలు కుట్టకుండా దోమతెరలు ఉపయోగించుకోవాలని వివరించారు. వైద్య శిబిరం నిర్వహిస్తున్న ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె చెంచు గిరిజనులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని సూచించారు. గిరిజనులకు వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అనంతరం వైద్య సిబ్బంది కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియాను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాలుట్ల ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు నాయక్, హెచ్‌వో షేక్ బాషా, మోహన్, నాగలక్ష్మి, ఏఎన్‌ఎంలు మాధవి, రవణమ్మ, ఎల్‌టి జానారెడ్డి, సిబ్బంది నలగాటి వెంకట్రామయ్య నాయుడు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'మార్కాపురం జిల్లా' హామీ అమలయ్యేదెప్పుడో.?

- 'వెలిగొండ' మాదిరిగా అవుతుందని ప్రజల ఆందోళన
- జిల్లా ఏర్పాటు ఎప్పుడో స్పష్టత ఇవ్వని కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి-మార్కాపురం

రాష్ట్రంలో అధికారంలో ఎవరున్నా... పశ్చిమ ప్రకాశానికి అన్యాయమే జరుగుతోంది. పశ్చిమ ప్రకాశం గతంలో వైసిపికి అనుకూలంగా ఉండేది. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడూ కీలకమైన వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయలేకపోయింది. జిల్లాల పునర్విభజన సమయంలో అర్హత కలిగిన మార్కాపురం జిల్లాగా ఏర్పాటు చేయకపోవడం పెద్ద తప్పిదమే...!

ఈ నేపథ్యంలో పశ్చిమ ప్రకాశంలోని ప్రజలు వెలిగొండ ప్రాజెక్టుతో పాటు మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు కోసం ఆశలు పెట్టుకున్నారు. ఎన్నికల్లో వెలిగొండ ప్రాజెక్టు... మార్కాపురం జిల్లా అంశాలు బలంగా వినిపించాయి. అప్పట్లో అధికారంలో ఉన్న వైసిపి ఎలాగూ ఈ రెండింటినీ పూర్తి చేయకపోవడంతో... వెలిగొండ, మార్కాపురం జిల్లా రాగాలను టిడిపి ఎత్తుకుంది. వెలిగొండ ప్రాజెక్టు పూర్తిచేసే బాధ్యత తనదేనని ప్రస్తుత సిఎం చంద్రబాబు గత ఎన్నికల ముందు గట్టి హామీ ఇచ్చారు. జిల్లాల పునర్విభజన సమయంలో అన్ని అర్హతలూ కలిగిన మార్కాపురం జిల్లా చేయకపోవడంతో వైసిపి స్వార్థం ఉందని చంద్రబాబు నిందలు వేశారు. రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వస్తే వెలిగొండతో పాటు మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తానని బహిరంగ సభల్లో చంద్రబాబు చెప్పారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో మార్కాపురం జిల్లా చేస్తానని బలంగా చెప్పారు. 'నన్ను నమ్మండి... ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులను గెలిపించండి' అని కోరారు. గత ఎన్నికల్లో చంద్రబాబును బాగానే నమ్మారు. దర్శి, యర్రగొండపాలెం మినహా పశ్చిమ ప్రకాశంలోని మిగిలిన నియోజకవర్గాల్లో టిడిపి అభ్యర్థులను ఇక్కడి ఓటర్లు గెలిపించారు. ఒంగోలు పార్లమెంటు స్థానంలో కూడా టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన మాగుంట శ్రీనివాసులురెడ్డిని గెలిపించుకున్నారు. ఈ గెలుపులో వెలిగొండ ప్రాజెక్టు మొదటి అంశం కాగా... రెండోది మార్కాపురం జిల్లా. సిఎం చంద్రబాబు మార్కాపురం జిల్లా చేస్తానని చెప్పిన హామీ సమయం గడిచింది. కానీ జిల్లా విషయంలో నోరు మెదపడం లేదు. తాజాగా మార్కాపురం జిల్లా ఇప్పట్లో లేదని సిఎం చంద్రబాబు చెప్పినట్లుగా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఏది నిజమో... ఏది అబద్ధమో తెలియదు కానీ... వెలిగొండ ప్రాజెక్టు మాదిరిగా మార్కాపురం జిల్లాను ఎన్నికల వాగ్దానంగా పరిమితం చేయొద్దని ఇక్కడి ప్రజలు వేడుకుంటున్నారు.

పారిశుధ్య కార్మికుల కొరతతో అవస్థలు

- పేరుకుపోతున్న చెత్త, కాలువల పూడిక
- గ్రామ జనాభాకు తగ్గ కార్మికులు లేక ఇబ్బందులు
- పారిశుద్ధ్యం లోపించి దుర్గంధం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండల కేంద్రం, మేజరు పంచాయతీగా ఉన్న భట్టిప్రోలుకు పారిశుధ్య కార్మికుల కొరత వెంటాడుతుంది. దీంతో గ్రామంలో చెత్తా, చెదారం పేరుకుపోవడమే గాక అధిక వర్షాల సమయంలో నీటిపారుదలయ్యే మార్గం సక్రమంగా లేక ప్రజలు నానా వస్తువులు పడుతున్నారు. 20వేల మందికిపైగా ఉన్న భట్టిప్రోలు పంచాయతీలో కనీసం 30మంది పారిశుద్ధ్య కార్మికులు గ్రామంలో వీధులు శుభ్రపరిచేందుకు కేటాయించాల్సి ఉంది. కానీ ప్రస్తుతం 30 మంది సిబ్బంది ఉన్నప్పటికీ వారిలో 15 మంది మాత్రమే పారిశుధ్య నిర్వహణ పనుల్లో ఉన్నారు. మిగిలిన 15మంది కార్యాలయంలో అటెండర్లుగా, విద్యుత్ బల్బులు, చేతి పంపులు వేయడానికి, ట్యాంకుల నుండి త్రాగు నీటిని విడుదల చేయడానికి వంటి పనులకు ఉపయోగిస్తూ ఉంటారు. వీరుపోను ఉన్న 15 మందిలో నిత్యం ఇద్దరూ లేక ముగ్గురు వరకు వివిధ అనారోగ్య కారణాలతో సెలవులు పెడుతూ ఉంటారు. మిగిలిన కార్మికులు గ్రామంలోనిన్ని రహదారులను శుభ్రం చేయటానికి సమయం చాలక ఒక్క వార్డుకు నెలకు రెండు లేదా మూడు సార్లు వెళ్లే పరిస్థితి లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. భట్టిప్రోలు, తెనాలి రహదారిలో కొత్తపేట వద్ద బాల కోటేశ్వర స్వామి దేవస్థానం సమీపంలో రహదారిపై ఏ కొద్దిపాటి వర్షం కురిసిన నీరు నిలబడి రాకపోకలకు తీవ్ర అంతరాయాన్ని కలిగిస్తుందని వాపోతున్నారు. గ్రామ ప్రధాన రహదారికి ఇరువైపులా గ్రామస్తులు అక్రమలకు గురిచేసి రహదారి కంటే మిగులుగా అరుగులు కట్టుకున్నారు. దీంతో కురిసిన వర్షాపు నీరు రహదారిపై నిలబడి కాలువలను తలపిస్తుంది. మురుగునీటిని బయటకు తరలించే మార్గం లేకపోవడం గ్రామాన్ని తీవ్రంగా పట్టిపీడిస్తోంది. గ్రామం చుట్టుపక్కల సాగునీరు, మురుగు పారుదల కాలువలు ఉండటంతో గ్రామంలో మురుగు నీటిపారుదలకు సరైన మార్గం కల్పించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కాలువలు మెరక ప్రాంతంలో ఉండటం, గ్రామం మొత్తం లోతట్టు ప్రాంతంగా ఉండటం వలన మురుగు సమస్యకు అత్యంత ప్రధాన కారణంగా కనిపిస్తుందని ప్రజలు చెబుతున్నారు.

మురుగుతో ప్రబలుతున్నట్టు వ్యాధులు

గ్రామంలో మురుగునీటి సమస్య తీవ్రంగా ఉండటంతో దోమల భారినపడి ప్రజలు అంటువ్యాధులకు గురవుతున్నారు. గ్రామంలో మురుగు నీటి కాలువలను రహదారుల వెంట ఏర్పాటు చేసినప్పటికీ వాటిని ఎక్కడికక్కడే పక్కా డ్రైన్ నిర్మాణ చేపట్టి వదిలివేశారు. వాటిలో మురుగు నీరు, వర్షపు నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందుతున్నాయి. పలు రకాల వ్యాధులకు గురవుతున్నామని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో 7, 8 వార్డులు ప్రతి ఏట వర్షాల సమయంలో సుమారు రెండు నుండి మూడు నెలలపాటు మురుగునీటితో సహవాసం చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతమంది పాలకులు మారినా గ్రామంలో నెలకొన్న మురుగు పారుదల సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని ఆరోపిస్తున్నారు. అంతేకాక గ్రామ జనాభాను బట్టి పరిశుద్ధ కార్మికులను మరింతగా పెంపుదల చేసి గ్రామాన్ని పరిశుభ్రతగా తీర్చిదిద్దాలని కోరుచున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలో ఎప్పటికప్పుడు కార్మికులతో పారిశుధ్య నిర్వహణ చేపడుతున్నామని, వర్షాలు కారణంగా మురుగు నీటి కాలువలు నిత్యం పూడిపోతున్నాయని అన్నారు. వార్డుల వారీగా కార్మికులను కేటాయించి పారిశుద్ధ్యం చేయిస్తామని చెప్పారు.

కొద్దిపాటి వర్షానికే ఇళ్ల మధ్య ప్రవహిస్తున్న నీళ్లు

భట్టిప్రోలు పేరుకుపోయిన చెత్తాచెదారం

ఎసిని బహుకరిస్తున్న శ్రీనివాసరావు దంపతులు

ఏసీ బహూకరణ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండల కేంద్రమైన భట్టిప్రోలులోని శ్రీ షిరిడి సాయిబాబా దేవస్థానంనకు విశ్రాంత ఉపాధ్యాయులు బొలిశెట్టి శ్రీనివాసరావు ఆయన సతీమణి నిర్మలా దేవిలు దంపతులు ఎసిని బహుకరించారు. అలాగే కీర్తిశేషులు మద్దుల భాస్కరన్ జ్ఞాపకార్థం ధర్మపత్ని ఉదయశ్రీ, కుమారుడు సోమశేఖర్ సతీమణి రోహిత దేవస్థానంనకు సీలింగ్ చేయించినారు. వీరి ఇరుదంపతులకు ధన్యవాదాలు తెలుపుకుంటూ దేవస్థానం తరపున చిరు సత్కారం చేశారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ పాలకవర్గ అధ్యక్షులు తమ్మన రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి మెంట సాంబశివరావు, బుర్లె కిరణ్ కుమార్, సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ వద్ద నిలిచిన అక్రమ ఇసుక ట్రాక్టర్లు

ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ ప్రవేశపెట్టినప్పటికీ అది పూర్తిస్థాయిలో అమలు జరగక పోవడంతో ఇసుక కోసం అక్రమార్కులు అడ్డదారులు తొక్కుతున్నారు. ఈ విధానంతో అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వ పాలసీ సక్రమంగా లేకపోవడంతో రూ.వేలు చెల్లించి ఇసుకలో తరలించుకునే పరిస్థితి లేకపోవడంతో అక్రమ ఇసుక కొనుగోలుకు గృహ నిర్మాణదారులు కోరుకుంటున్నారు. దీనిని ఆసరాగా తీసుకొని నదికి సమీప గ్రామాల ట్రాక్టర్ యజమానులు ఈ అక్రమ ఇసుకకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం నిర్దేశిత రిచ్‌లలోనే ఇసుక తరలించాలని నిబంధన పెట్టడం, అది సక్రమంగా అమలు జరగకపోవడంతో ఇసుక అక్రమ రవాణా చేపట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. ఉచిత ఇసుక పోలసీని పటిష్టంగా అమలు చేయాలని ఇటీవల ప్రజా సంఘాలు ఆందోళన చేపట్టడంతో స్పందించిన కలెక్టర్ గత 4రోజుల క్రితం భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లోని ఇసుక రీచ్‌లను పరిశీలించారు. కానీ ఇసుకను ప్రభుత్వం ఉచితంగా అందించే పాలసీని ఈ నెల 16నుండి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వస్తున్న సమాచారంతో ప్రజలు ఎదురు చూస్తున్నారు. జువ్వలపాలెం, ఓలేరు ఇసుక రిచ్‌ల నుండి ఉచిత ఇసుకకు అనుమతినిస్తే ప్రజలకు దగ్గర మార్గంగా ఉండటమే కాక తక్కువ ఖర్చుతో ఇసుక చేరుతుందని భావిస్తున్నారు.

14 నుండి పల్లె పండుగ

ప్రజాశక్తి - సంతమాగులూరు

ఈనెల 14నుండి 18వరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ జ్యోతిర్మయి తెలిపారు. వారోత్సవాలు గతంలో జరిగిన గ్రామసభల ద్వారా అనుమతి పొందిన ఎంజిఎన్‌ఆర్‌ఈజిఎస్ పనులను క్షేత్రస్థాయిలో పారదర్శకంగా పండుగ వాతావరణంలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు మెంబర్లు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొంటారని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రతి గ్రామంలో దండోరా వేయించి ముందుగా ప్రజలకు తెలియపర్చాలని సూచించారు.

మృతుడి ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

అమర్తపూడి నాగేశ్వరరావు (34)

సాగర్ కాలువలో బయటపడిన గుర్తుతెలియని మృతదేహం వివరాలు తెలిసినట్లు అర్బన్ సీఐ మాదినేని శేషగిరిరావు గురువారం తెలిపారు. 2 రోజుల క్రితం మండలంలోని జంగమహేశ్వరపురం, రాంకురు గ్రామాల మధ్య ఎబిసి కాలువలో గుర్తు తెలియని మృతదేహం తెలియాడుతుందని స్థానికులు ఇచ్చిన సమాచారంతో హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహం బయటకి తీయించారు. మృతుడు వద్ద ఎటువంటి వివరాలు లభించకపోవడంతో వివిధ పోలీసు స్టేషన్లకు సమాచారం అందించారు. పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం శానంపూడి గ్రామానికి చెందిన అమర్తపూడి నాగేశ్వరరావు (34) గత సోమవారం నుండి కనిపించడం లేదని శావల్యాపురం పోలీసు స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అక్కడి పోలీసులు మార్టూరు పోలీసులకు సమాచరం ఇచ్చారు. ఎబిసి కాలువలో బయటపడిన మృతదేహం కనిపించకుండా పోయిన నాగేశ్వరరావుదిగా పోలీసులు గుర్తించారు. శానంపూడి నుండి మృతుడి భార్య కోటేశ్వరమ్మ, బంధువులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు చేరుకొని మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతం అయ్యారు.

ఇప్పుడే వస్తానని.. వెళ్లి శవంగా మారాడు

ట్రాక్టర్ నడుపుతూ జీవనం సాగించే అమర్తలూరి నాగేశ్వరరావు ఈ నెల 7న ఫోన్ కాల్ రావడంతో ఇప్పుడే వస్తానని ఇంట్లో భార్యకు చెప్పి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి రాకపోవడంతో మరుసటి రోజు బంధువులు శావల్యాపురం పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన అక్కడి పోలీసులు నాగేశ్వరరావు ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో 9న మార్టూరు సమీపంలోని జంగమహేశ్వరపురం ఎబిసి కాలువలో గుర్తు తెలియని మృతదేహం ఉందని సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాల్లో మృతదేహానికి పోస్ట్ మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. పోస్ట్ మార్టం నివేదిక అందిన తర్వాతే అనుమానాస్పద మృతిపై వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉంది.

వైభవంగా దసరా నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి - ఇంకొల్లు

దసరా నవరాత్రుల్లో భాగంగా 8వ రోజు శివాలయంలో పార్వతీ దేవిని దుర్గామాతగా అలంకరించారు. శివ పార్వతులను నంది వాహనంపై ఊరేగింపు చేశారు. చెన్నకేశవ ఆలయంలో లక్ష్మీదేవిని దుర్గాదేవిగా అలంకరించారు. విష్ణుమూర్తి, లక్ష్మీదేవి అవతారా లను గరుడ వాహనంపై ఊరేగిం పు చేశారు. 8వ రోజు నవరాత్రు ల సందర్భంగా శిరిడి సాయి మందిరంలో అన్న దానం నిర్వహించారు. వీరభద్రేశ్వర ఆలయంలో వీరభద్రేశ్వరునితో పాటు భద్రకాళి అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి భక్తులు పూజలు నిర్వహించారు. పద్మాలం కమ్మ గుడిలో అంకమ్మ తల్లిని దుర్గాదేవిగా అలంకరించారు. ఆలయాల్లో భక్తజన సమాజాల ఆధ్వర్యంలో భక్తి గీతాలు ఆలపించి తీర్థప్రసాదాలు భక్తులకు పంచారు.

దుర్గాదేవి అలంకరణలో పార్వతీదేవి

అద్దంకి : శ్రీ చక్ర సహిత శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో 503వ దసరా నవరాత్రుల సందర్భంగా గురువారం దుర్గాదేవి అలంకరణలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. పట్టణానికి చెందిన ఊటుకూరి సుబ్బరామయ్య బ్రదర్స్ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రుల సందర్భంగా 18కిలోల లడ్డుని సమర్పించారు. కార్యక్రమంలో ఊటుకూరు రామ కోటేశ్వరరావు, చిన్ని శ్రీనివాసరావు, రైటర్ వీరయ్య, చుండూరి మురళి సుధాకరరావు పాల్గొన్నారు.

చీరాల : వాసవీ కన్యక పరమేశ్వరి అమ్మవారు, దండుబాటలోని జ్వాలాముఖి అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆయా ఆలయాల్లో భక్తుల దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలు వినియోగించారు.

జెసిబితో కాల్వల పనులు చేయిస్తున్న రైతులు

సొంత నిధులతో కాలువ పూడికతీత పనులు

ప్రజాశక్తి -కారంచేడు

పంట పొలాలకు సంబంధించి నీటిపారుదల వ్యవస్థ సక్రమంగా ప్రవహించడానికి డ్రైనేజీ అధికారులు చేయాల్సిన పనులు రైతులే పూనుకుని చేసుకుంటున్నారు. మండలంలోని స్వర్ణ వరి పొలాలకు కొమ్ముమూరు కాలువ నుంచి నీరు వస్తుంది. అయితే గత కొన్ని రోజులుగా కాలువ నుంచి పొలాలకు వచ్చిన నీరు ఎక్కువ అవడంతో వాటిని పక్కనే ఉన్న పులగ కాలువలోకి మళ్ళించారు. ఆ కాలువ పారుదల సరిగ్గా లేకపోవడంతో మీరు మళ్ళీ ఎక్కడికక్కడే ఆగిపోయి మళ్లీ వెనుక్కు రావడంతో పొలాలు మునిగిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్వర్ణకు సంబంధించిన పలువురు రైతులు సొంత ఖర్చులతో గత రెండు రోజులుగా పులగ కాలువకు పూడిక తీయించే పనులు ప్రారంభించారు. జెసిబి సహకారంతో సుమారు నాలుగు కిలోమీటర్ల పరిధిలోని పులక కాలువకు పూడిక పని చేస్తున్నారు. దీనికి సంబంధించి 48 గంటల పనికి జెసిబికి రూ.80వేలు ఖర్చు రైతులే భరించి పొలాలకు నీరు ఎదురు రాకుండా సక్రమంగా కాలువలోకి మళ్లించడానికి భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. వాస్తవానికి పొలాలకు పెట్టుకోగా మిగిలిన నీటిని బయటికి పంపడానికి ఉన్న కాలువలు డ్రైనేజీ శాఖ అధికారులు మరమ్మతులు చేయించాలి. అయితే గత కొన్నేళ్లుగా కాలువకు మరమ్మతులు, పూడిక లేకపోవడంతో పిచ్చి మొక్కల పెరిగిపోయాయి. కాల్వల నిర్వహణ వదిలేయడంతో కాల్వల్లో మట్టి మేటలు వేసింది. పిచ్చి మొక్కలు పెరిగి నీరు ప్రవాహానికి ఆటంకంగా ఏర్పడింది. వరదల సమయంలో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. దీంతో రైతులే సొంతగా ఖర్చు భరించి కాల్వలో పూడిక, చెట్లను తొలగిస్తున్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి డివి లలిత కుమారి

ముగిసిన పంచాయతీ పాలకవర్గ సభ్యుల శిక్షణ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజులపాటు ఆయా పంచాయతీల ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు ఏర్పాటు చేసిన శిక్షణా తరగతి గురువారంతో ముగిసింది. శిక్షణ ముగింపు సందర్భంగా ఎంపిపి డివి లలితకుమారి మాట్లాడారు. పాలకవర్గ సభ్యులు పంచాయతీలో జరుగుతున్న అనేక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. శిక్షణలో తెలుసుకున్న వివిధ అంశాలను అవగాహన చేసుకుని గ్రామాల్లో ప్రజలకు సేవ చేసేందుకు వినియోగించుకోవాలని సూచించారు. గ్రామాల్లో సర్పంచులు, వార్డు సభ్యులు, ఉపసర్పంచులకు తగిన ప్రాధాన్యత ఇవ్వటం లేదని ఎంపిపి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలకు సేవ చేయటానికి వచ్చిన తమకు ఎలాంటి ప్రాధాన్యత లేకపోవడంతో గ్రామాల్లో తమ వార్డుల్లో అవసరమైన అభివృద్ధిని తమ ద్వారా చేపట్టలేక పోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. సర్పంచులు పాలకవర్గ సభ్యులు అందరూ సమన్వయంతో పనిచేసే గ్రామాల అభివృద్ధికి ప్రజా సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాలని వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్‌వి రమణ, సూపరింటిండెంట్ సిహెచ్ జలజ, కార్యాలయం సిబ్బంది, ఆయా పంచాయతీల ఉపసర్పంచులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పరిహారం అందజేస్తున్న తహశీల్దారు శ్రీనివాసరావు

బాధితులకు పరిహారం పంపిణీ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఇటీవల కృష్ణా నదికి సంభవించిన వరదల కారణంగా లంక గ్రామాల్లో గృహాలు నీట మునిగి నష్టపోయిన గృహపకరణాలకు వాటి విలువ ఆధారంగా నష్టపరిహారాన్ని తహశీల్దారు మేకా శ్రీనివాసరావు గురువారం బాధితులకు అందజేశారు. గ్రహాలు నీట మునిగి దెబ్బతిన్న వారికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున, బైకులు దెబ్బతిన బాధితులకు రూ.3వేలు చొప్పున మొత్తం 29 మంది బాధితులకు అందజేసినట్లు ఆయన తెలిపారు. మండలంలోని పెదలంక, పెసరలంక, చింతమోటు గ్రామాల్లో గృహాల్లోకి వరద నీరు రావడంతో గృహపకరణాలు తడిసి పాడైపోయిన వాటిని ఇటీవల సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదించారు. ఆ నివేధిక ఆధారంగా మంజూరైన రు.1.61లక్షలు తహశీల్దారు ఖాతాకు జామ కాగా వాటిని బాధితులకు జాబితా ప్రకారం అందజేసినట్లు వివరించారు. బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఈపాటికే నష్టం అంచనాలు తయారు చేసినట్లు తెలిపారు. నష్టపోయిన వస్తువుల వివరాలు అధికారులు నమోదు చేసుకుని ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. వ్యవసాయ నష్టంతోపాటు గృహెూపకరణాలకు నష్టపరిహారం అందజేస్తున్నట్లు తెలిపారు. వాహనాల మరమ్మత్తులకు పరిహారం ఇవ్వనున్నట్లు తెలిపారు. వాహన ఇన్సూరెన్స్ కంపెనీలు, మెకానిక్ షోరూంలతోను సంప్రదింపులు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పెదలంక సర్పంచ్ వేములపల్లి రంజిత, నాయకులు వేములపల్లి రత్న గోపాల్, టిడిపి నాయకులు, విఆర్ఒలు పుల్లయ్య, వెంకటేశ్వరరావు, జకరయ్య పాల్గొన్నారు.

ఇసుక తవ్విన స్థలం పరిశీలన

• ప్రభుత్వ సొన పోరంబోకు భూములకు పోలీస్ పహారా

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - వేటపాలెం

ఇసుక మాఫియా ఆగడాలు ఆగటం లేదు. ఏకంగా కలెక్టర్ అనుమతి పేరుతో బరితెగించి ప్రభుత్వ సొన పోరంబోకు భూముల్లో అక్రమంగా ఇసుక తవ్వుకెల్ల టంపై ఈ నెల 3న 'యదేచ్చగా ఇసుక తవ్వకాలు, కలెక్టర్ అనుమతి ఉందంటూ బలితెగింపు' శీర్షికన కథనం ప్రజాశక్తి ప్రచురించిన విషయం పాఠకు లకు తెలిసిందే. ఈ సంఘటన గురించి స్పందించిన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చిన్నగంజాం తహశీ ల్దారు మోటుపల్లి విఆర్‌ఓ మునీర్, ఎస్ఐ రమేష్ కొలతలు తీశారు. అక్రమార్కులు ఇసుక తవ్విన ప్రదేశానికి వెళ్లి కొలతలు వేసి స్థలాన్ని పరిశీలించారు. చిన్నగంజాం మండలంలోని మోటుపల్లి గ్రామ సర్వేనెంబర్ 7లోని సొన పోరంబోకు ప్రభుత్వభూమిగా నిర్ధారించారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించారు. ఉన్నతాధికా రుల ఆదేశాల మేరకు ఆ భూముల్లో పోలీస్ పహారా నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. కారంచేడు పంచాయతీ ఫిల్టర్ బెడ్స్ పేరుతో 40 ట్రక్కులు ఇసుక అవసరమని సాక్షాత్తు పంచాయితీ సెక్రటరీ శ్రీనివాసరావు తన కార్యాలయ స్టాంపు వేసి సంతకం చేసి స్లిప్పులు ఇచ్చారు. అదే విషయం గురించి ప్రజాశక్తి తన కథనంలో ప్రస్తావించింది. ఎంపీ, మంత్రి, కలెక్టర్, ఎస్పీ వంటి ఉన్నతాధికారుల చొరవతోనే ఇసుక తీసుకెళ్లారని అనుకున్నా సొన పోరంబోకు ప్రభుత్వ భూమిలో తీసుకెళ్లమని చెప్పలేదు కదా? గ్రామానికి అవసరమైన ఇసుక డబ్బులు ఇచ్చే కదా తోలించుకోంది. ఉన్నతాధికారులు ప్రభుత్వ సోన పోరంబోకు భూమిలో తవ్వమని చెప్పలేదు. 40 ట్రక్కుల ఇసుక కోసం 200 ట్రక్కుల ఇసుక తవ్వకాలు జరపటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అక్రమార్కులను గుర్తించి చట్టపరంగా శిక్షించి మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన అవసరం ఉన్నత అధికారులపై ఉన్నదని ప్రజలు కోరుతున్నారు.

పాఠశాలను చుట్టుముట్టిన వర్షపు నీళ్లు

చుట్టూ వర్షపు నీటి మధ్యలో దగ్గుబాడు పాఠశాల భవనం

ప్రజాశక్తి - కారంచేడు

మండలంలోని దగ్గుబాడు ప్రాథమిక పాఠశాల వర్షం వస్తే నీట మునిగిపోతుంది. దీనిపై అధికారులకు ఎన్ని విజ్ఞప్తులు చేసినా పట్టించుకోవడంలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మండలంలోని దగ్గుబాడు ప్రాథమిక పాఠశాలలో 35 మంది విద్యార్థులు చదువుతున్నారు. దాని పక్కనే అంగన్‌వాడి పాఠశాల ఒకే ఆవరణలో ఉన్నాయి. రోడ్డుకు మూడు అడుగులు దిగువన ఉండడంతో కొద్దిపాటి వర్షం పడ్డ రెండు అడుగులపైగా నీళ్ల ఉంటున్నాయి. నీరు బయటకు పోయే మార్గం లేక అక్కడే ఇంకి పోవాల్సిన పరిస్థితి ఉంది. దీంతో పాఠశాలకు పోయే విద్యార్థులు బురదలో నడవలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షపు నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండడంతో దోమలు చేరి చుట్టుపక్కల ప్రజలకు విష జ్వరాలు వస్తున్నాయని చెబుతున్నారు. దీనిపై విద్యాశాఖ అధికారులు, పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదని చెప్పారు. విద్యార్థులు ఉపయోగించే మరుగుదొడ్లు సైతం పూర్తిగా నీట మునిగిపోయాయి. రెండు రోజుల క్రితం పడిన కొద్దిపాటి వర్షానికి పాఠశాలలో నీరు చేరి మరుగుదొడ్లు, పాఠశాల ఆవరణ మునిగిపోయింది. ప్రస్తుతం పాఠశాలకు పండుగ సెలవులు రావడంతో విద్యార్థులు ఎవరు రావడం లేదు. అయితే గతంలో పలుమార్లు పడిన వర్షానికి పాఠశాలకు సెలవులు ఇచ్చారని స్థానికులు చెప్పారు. దీనిపై ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు జోక్యం చేసుకొని పాఠశాల ఆవరణ నీటమునగ కుండా మెరక తోలించాలని కోరుతున్నారు. మరుగుదొడ్ల పరిస్థితి కూడా చాలా దారుణంగా ఉందని, వీటిని కూడా బాగు చేయించి ఉపయోగంలోకి తేవాలని కోరుతున్నారు.

చుట్టూ వర్షపు నీటి మధ్యలో పాఠశాల భవనం

వరిలో ఉధృతంగా తెగుళ్ల వ్యాప్తి

ప్రజాశక్తి - రేపల్లె

కోటి ఆశలతో వరి సాగు చేసిన రైతాంగాన్ని తెగుళ్ల బెంబేలెత్తిస్తున్నాయి. ప్రస్తుతం వరి పైరు పిలకల దశ నుంచి చిరుపొట్ట దశకు చేరుకోవడంతో చీడ, పీడలు ఆశించే ముప్పు కనిపిస్తున్నది. పంట దిగుబడులపై పెను ప్రభావం చూపే ప్రమాదం ఉండగా, సస్యరక్షణ చర్యలతోనే పంటను కాపాడురోవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. వరి నాటిన దగ్గరి నుంచి తెగుళ్ల ఉధృతి అధికమైంది. ఎన్ని సస్యరక్షణ చర్యలు చేపట్టినా ప్రకృతి అనుకూలత లేకపోవడంతో పంట ఎదుగుదల్లో సమస్యలు ఏర్పడ్డాయి. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ ఏడాది నీటి లభ్యత కారణంగా నియోజకవర్గంలో తొంబై శాతం వరి సాగైంది. ప్రస్తుత వర్షాకాలంలో డెల్టా ప్రాంతంలో వరి విస్తీర్ణంలో 95శాతం బిపిటీ రకాలు సాగు చేశారు. వరుసగా భారీ వర్షాలు, ముసురుతోపాటు ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసాలు, ఉక్కపోత వంటి కారణాలతో వరి సాగులో ఇబ్బందులు ఎదురయ్యాయి. వరదలకి ముంపుకు గురైన వరి కోలుకుంటున్న దశలో పచ్చపురుగు ఆశించింది. ఆకును గీరి తినడంతో పచ్చగా మారింది. ఇప్పటి వరకు రెండు నుంచి మూడు సార్లు రైతులు పురుగు మందులు పిచికారీ చేశారు. సాధారణ రసాయనిక మందులు పని చేయకపోవడంతో కొత్త రకం, ఖరీదైన మందులూ పిచికారీ చేస్తున్నారు. ధర అధికంగా ఉండటంతో ఎకరానికి రూ.2,500 వరకు ఖర్చు వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వాతావరణం అనుకూలిస్తే తప్ప పంట చేతికొచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులు చేపట్టాలి
ఎడిఎ ఆర్ విజయబాబు

రైతులు దశాబ్దకాలంగా సేంద్రీయ ఎరువులు వాడటం లేదు. పశువుల ఎరువుతో పాటు పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము పంటలు రైతులు సాగు చేయడం లేదు. కేవలం అడుగు పిండితో పాటు నత్రజని ఎరువులు అధికంగా వాడటం వల్ల భూమిలో పోషక విలువలు తగ్గాయి. గత పంటల అనుభవాల దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండి పంటను ఎప్పటికప్పుడు గమనిస్తూ చీడపీడలను గుర్తించి సకాలంలో నివారణ చర్యలు చేపడితే నష్టాలను తగ్గించుకోవచ్చు. అధిక దిగుబడులు సాధించవచ్చు. వరిలో తెగుళ్ల నివారణకు వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్న సూచనలు పాటించాలని చెప్పారు. అధికంగా పురుగు మందులు వాడొద్దన్నారు.

వదంతులు నమ్మొద్దు

టిడిపి జిల్లా అధ్యక్షులు సలగల రాజశేఖరబాబు

ప్రజాశక్తి - బాపట్ల

సలగల రాజశేఖర్ బాబు

బాపట్ల జిల్లాను మారుస్తున్నట్లు వస్తున్న వదంతులు నమ్మవద్దని టిడిపి జిల్లా అధ్యక్షులు సలగల రాజశేఖర్ బాబు అన్నారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఒక జిల్లాగా ప్రతిపాదనలు చేయడం జరిగిందని అన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కొందరు పనిగట్టుకుని అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. పార్లమెంటు పరిధి దాటి జిల్లా ఏర్పాటు చేస్తున్నారనే ప్రచారంలో వాస్తవం లేదని అన్నారు. మంత్రులు సైతం జిల్లా మార్చడం జరగదని స్పష్టంగా తెలియజేశారని అన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ఎడిఎ మోహనరావు

వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి - పర్చూరు

పర్చూరు, ఉప్పుటూరు గ్రామల్లోని రైతు సేవా కేంద్రంలో జిఎపి పొలంబడి నిర్వహించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు పి రత్నకుమారి వరి పంటలో వచ్చే తెగుళ్ల, పురుగుల యాజమాన్యం గురించి రైతులకు క్లుప్తంగా వివరించారు. ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త బాల మురళీధర్ నాయక్ ఎలుకల నివారణ గురించి వివరించారు. పర్చూరు ఎడిఎ పంట సాగు చేసిన ప్రతి రైతు తమ పంటను ఈ పంట నందు నమోదు చేసుకోవాలని తెలిపారు. పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే, అనివార్య కారణాల వల్ల పంట వరద ముంపుకి గురైన, కరువు వచ్చిన పంట నష్టపరిహారం, ఉచిత పంటల బీమా వర్తిస్తుందని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఏడాదికి రూ20వేల నగదు ప్రభుత్వం రైతుల ఖాతాలో జమ చేస్తుందని తెలిపారు. వివిధ ఎరువుల్లో పోషకాల లభ్యత గురించి వివరించారు. పంట సాగు చేసే ముందు, పచ్చి రొట్టె ఎరువులైన జీలుగ, జనుము, పిల్లి పెసర విత్తనాలను భూమిలో వేసుకొని పూత దశలో భూమిలో కలియ దున్నాలని తెలిపారు. శెనగ పంటలో వచ్చే ఎండు తెగులు నివారణ గురించి వివరించినారు. శనగ పంటలో ఎండు తెగులు నిర్మూలనకు ట్రైకోడెర్మా విరిడిని దిబ్బ ఎరువులో కలిపి ఏ విధంగా సాయిల్ అప్లికేషన్ చేసుకోవాలో వివరించారు. విత్తన శుద్ధి చేసుకోవడం ద్వారా తెగుళ్లను తట్టుకునే శక్తి పంటకు వస్తుందని తెలిపారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే విధంగా యాజమాన్య పద్ధతులు పాటించాలని చెప్పారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం చేపడుతున్న పొలం బడి కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రవేత్తలు సూచిస్తున్న పద్ధతు లు పాటించాలని చెప్పారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి నేల ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. ఎఒ ఎన్ మేరమ్మ పొలంబడి గురించి వివరించారు. విత్తన శుద్ధి ఏ విధంగా చేసుకోవాలో చెప్పారు. పొలంబడికి సంబంధించి బ్యాలెట్ బాక్స్ టెస్ట్ లో రైతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎడిఎ ఎన్ మోహనరావు, సర్పంచ్ పాలపర్తి భూషిరెడ్డి, విఎఎ జి నాగబాబు, తుళ్లూరి రాజీవి పాల్గొన్నారు.

ఎల్ఐసి యాజమాన్యం

చెత్త నిర్ణయాలు మానుకోవాలి

సమస్యలపై లియాఫీ వినతి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎల్ఐసి యాజమాన్యం చెత్త నిర్ణయాలు చేయటం మానుకొని ఏజెంట్ల వ్యవస్థకు సహకరించాలని లియాఫీ యూనియన్ ఒంగోలు బ్రాంచ్ అధ్యక్షులు మన్నం ప్రసన్నరాజు డిమాండ్ చేశారు. స్థానిక ఎల్ఐసి కార్యాలయంలో లియాఫీ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మన్నం ప్రసన్నరాజు మాట్లాడుతూ ఇటీవల ఎల్ఐసి యాజమాన్యం ఏజెంట్ వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా ఆలోచన చేస్తోందని, దేశంలో అతి పెద్ద ఆర్థికవ్యవస్థ ఎల్ఐసి అభివృద్ధికి కారణం ఏజెంట్ కష్టి మాత్రమేనని తెలిపారు. ఈ మధ్య కాలంలో మేనేజ్‌మెంట్ ప్రైవేట్ కంపెనీలతో లాలూచీ పడుతూ.. పాలసీదారుల వయస్సు తగ్గించటం, పాలసీలపై వచ్చే కమిషన్ భారీగా తగ్గించటం, పాలసీదారులకు జిఎస్‌టి విధించడం వంటి ఆలోచనలూ చేస్తోందన్నారు. ఎల్ఐసి ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేసేలా నిర్ణయాలు తీసుకుంటుందని, వీటిని లియాఫీ ఏజెంట్స్ యూనియన్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. మేనేజ్‌మెంట్ తీసుకునే చెత్త నిర్ణయాలు ఆపకపోతే దేశంలోని అన్ని ఎల్ఐసి కార్యాలయాల వద్ద పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఎల్ఐసి వ్యాపారం ఆపివేస్తామన్నారు. అనంతరం ఎల్ఐసి కార్యాలయంలో ఎల్ఐసి నెల్లూరు డివిజన్ మార్కెటింగ్ మేనేజర్ ఓ. కృష్ణమూర్తి, ఒంగోలు బ్రాంచ్ మేనేజర్ రెహ్మాన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.వెంకటేశ్వర్లు, మధు, గోవింద్, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, సునీల్, రాంబాబు, శ్రీనివాసరావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్ నారాయణ

మున్సిపల్ ఆదాయం పెంచడంలో

కీలకంగా పనిచేయాలి

కమిషనర్ డివిఎస్ నారాయణ

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీలో ఆదాయాన్ని పెంచడంలో వార్డు సచివాలయాల అడ్మిన్‌లు కీలకంగా పని చేయాలని మున్సిపల్ కమిషనర్ డివిఎస్ నారాయణ కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అడ్మిన్‌లతో గురువారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ నారాయణ పలు సూచనలు చేశారు. మున్సిపాలిటీలో పన్నులు చెల్లించే పరిధిలో లేని భవనాలు అనేకం ఉన్నాయన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ అసైన్డ్, అండర్ అసైన్డ్ భవనాలను గుర్తించాలన్నారు. ఆ విధంగా గుర్తించిన భవనాలను పన్ను పరిధిలోకి తీసుకురావాలన్నారు. పన్నుల పరిధిలోకి రాని భవన యజమానులు, అదనపు నిర్మాణాలు చేపట్టాలనుకునే వారు సంబంధించిన ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, తదితర పత్రాలతో మీ పరిధిలోని వార్డు సచివాలయంలో అడ్మిన్ సెక్రటరీకి అందజేయాలని కమిషనర్ నారాయణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ప్రతి నీటి బిందువునూ ఒడిసి పట్టుకోవాలి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రతి నీటి బిందువునూ ఒడిసి పట్టుకుంటేనే జల వనరులను సంరక్షించుకోగల మని రాష్ట్ర జల వనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శంభునాథ్ గుప్తా తెలిపారు. ఎనిమిది రాష్ట్రాలలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో ఢిల్లీ నుంచి గురువారం వీక్షణ సమావేశం నిర్వహించారు. బాపట్ల జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి హాజరయ్యారు. జలవనరులను ఇప్పుడు సంరక్షించుకుంటేనే భావితరాలకు నీటిని అందించగలమని రాష్ట్ర జల వనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అన్నారు. జల శక్తి అభియాన్ కార్యక్రమాన్ని నవంబర్ 30వ తేదీ వరకు భారత దేశమంతా నిర్వహిస్తుందన్నారు. జన్ భాగిదారి, జల సంచాయ్ కార్యక్రమాలు విస్తృతంగా జరపాలన్నారు. వర్షపు నీటిని భద్రపరచుకుంటేనే భవిష్యత్ తరాలకు నీటిని అందించగలమన్నారు. వర్షపు నీరు భూమిలోకి వెళ్లేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. తద్వారా భూగర్భ జలాలు మరింత పెరుగుతాయని తెలిపారు. చెరువులు, నీటి కుంటలు, ట్యాంకులను రీఛార్జ్ చేసుకుంటేనే జల వనరులను భద్రపరచుకోగలమన్నారు. సంరక్షించుకోవ డానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇష్టమైన కార్యక్రమాలను చేపడుతున్నారని వివరించారు. వీక్షణ సమావేశంలో జిల్లా నుంచి డ్వామా పిడి విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ జె.వెంకటమురళి

శాంసంగ్ కార్మికుల డిమాండ్లు నెరవేర్చండి..

- సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు డిమాండ్
- ఒంగోలు శాంసంగ్ షోరూమ్ వద్ద సిఐటియు ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మద్రాస్ శాంసంగ్ కార్మికుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు డిమాండ్ చేశారు. సిఐటియు ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కర్నూల్ రోడ్, పవర్ ఆఫ్ ఎదురు శాంసంగ్ షోరూం వద్ద గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి సిఐటియు నగర కార్యదర్శి టి.మహేష్ అధ్యక్షత వహించారు ఈ సందర్భంగా కాలం సుబ్బారావు మాట్లాడుతూ గత నాలుగు వారాల నుండి మద్రాస్‌లో శాంసంగ్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికులు సమ్మె చేస్తున్నారన్నారు. వారి సమస్యలు పరిష్కరించకపోగా కంపెనీ యాజమాన్యం కార్మికులను భయాందోళనకు గురిచేస్తున్నారన్నారు. శాంసంగ్ కంపెనీలో రెండు వేల మంది కార్మికులు ఉంటే సిఐటియు ట్రేడ్ యూనియన్‌లో 1500 మంది సభ్యులుగా చేరారన్నారు. వాళ్ళ యూనియన్ రిజిస్ట్రేషన్ చేసు కోవటానికి కోసం దరఖాస్తు చేసుకుంటే అక్కడ కార్మిక శాఖ, రాష్ట్ర ప్రభుత్వం యూనియన్ రిజిస్ట్రేషన్ చేయకపోగా పోలీస్ యంత్రాంగాన్ని ఉపయోగించి సమ్మె చేస్తున్న కార్మికులను వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. దక్షిణ కొరియా దేశంలోని శాంసంగ్ యాజమాన్యంపై చర్యలు తీసుకోకుండా, ఇతర దేశాల్లో ఉన్న శాంసంగ్ కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులకు లక్షల రూపాయలు వేతనాలు ఇస్తున్నారన్నారు. మద్రాస్ శాంసంగ్‌లో పనిచేస్తున్న కార్మికులకు అతి తక్కువ వేతనాలు ఇస్తున్నారన్నారు. కార్మికుల వేతనాలు పెంచాలని కార్మికులను యూనియన్ రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ మద్రాస్ శాంసంగ్ కంపెనీ కార్మికుల పోరాటానికి గత మూడు రోజుల నుండి రాష్ట్రవ్యాప్తంగా సిఐటియు కమిటీలు మద్దతుకి కూడగడుతున్నారన్నారు. ఇప్పటికైనా తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం, శాంసంగ్ యాజమాన్యం కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే దేశవ్యాప్తంగా ఉన్న కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యుఫ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అయ్యపరెడ్డి, మెడికల్ రిప్స్ యూనియన్ ఒంగోలు బ్రాంచ్ అధ్యక్షులు సిహెచ్.చిరంజీవి, మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ జిల్లా నాయకులు నాగేశ్వరావు, సిఐటియు నగర ఉపాధ్యక్షులు జిజరమేష్, కొర్నెపాటి శ్రీనివాసరావు, ఎస్‌డి.హుస్సేన్, మున్సిపాలిటీ యూనియన్ నాయకులు ఎం.బాబు, ఆర్.రాములు, ఆర్.శ్రీనివాసరావు, జి.అంకయ్య పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కమిషనర్ రఘునాథరెడ్డి

ప్రజాశక్తి-బాపట్ల

కలెక్టర్‌ను కలిసిన కమిషనర్

బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా జి. రఘు నాథరెడ్డి బాధ్యతలు చేపట్టాక గురువారం జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళిని కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పొద్దుటూరు నుండి కమిషనర్‌గా బదిలీపై ఆయన బాపట్లకు వచ్చారు. అంతకు ముందు ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన నిర్మల్ కుమార్ కేంద్ర అకౌంట్స్ విభాగానికి బదిలీ అయ్యారు. బాపట్ల నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ బాపట్ల పట్టణాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. పట్టణంలో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. పట్టణానికి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తానని తెలిపారు.

అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మానసిక ఆరోగ్యమే మహాభాగ్యం

ప్రజాశక్తి-పుల్లలచెరువు

మానసిక ఆరోగ్యమే మహాభాగ్యం అని సిహెచ్‌వో శ్రీకాంత్ అన్నారు. గురువారం ప్రపంచ మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని కొమరోలు గ్రామంలో గల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అనేది ఒకప్పటి నానుడి అన్నారు. మానసిక ఆరోగ్యమే మహాభాగ్యం అనేది ఇప్పటి మాట అని చెప్పారు. బిజీ జీవితంలో మానసికంగా ఆరోగ్యంగా ఉంటేనే శరీరకంగా ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. మనస్సు సక్రమంగా ఉంటేనే ప్రశాంతమైన జీవితం మీ సొంతం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం షేక్ ముబినా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

పేద మహిళల

జీవనోపాధి అవకాశాలను పెంచాలి..

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పేద మహిళలకు జీవనోపాధి కల్పించడంతో పాటు వారిని లక్షాధికారులను చేసే కృషి జరగాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. పేద మహిళల జీవనభృతి, ఆర్థిక ఎదుగుదలపై అనుబంధ శాఖల అధికారులతో గురువారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. పేద మహిళలను లక్షాధికారులను చేయాలనే కేంద్ర ప్రభుత్వం ఉద్దేశాన్ని పక్కాగా అమలుచేయాలని కలెక్టర్ తెలిపారు. పిఎంఈజిపి పథకం కింద 135 యూనిట్లు బాపట్ల జిల్లాలో స్థాపించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ప్రస్తుతం 66 యూనిట్లు మంజూరు కాగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. సత్వరమే లక్ష్యాలు చేరుకోవాలని ఆయన సూచించారు. పీఎంఎఫ్ఎంఈ పథకం కింద 4,500 యూనిట్లు స్థాపించడానికి కేంద్రం అనుమతులు ఇచ్చిందన్నారు. రూ.ఒక లక్ష నుంచి రూ.ఐదు లక్షల వరకు రుణం పొందే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. బ్యాంకర్లు సహకరించాలని, మహిళలను లక్షాధికారులను చేసే కార్యక్రమాల్లో బ్యాంకర్లు ప్రధాన పాత్ర పోషించాలన్నారు. ఈ సమావేశంలో డి ఆర్ డి ఏ పీడీ పద్మజ, డ్వామా పీడీ విజయలక్ష్మి, ఎల్‌డిఎం శివకృష్ణ, ఉద్యానవన శాఖ ఏడి జె జెన్నెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

22న జడ్పీ సమావేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశం పాత జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 22న ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని జడ్పీ సిఇఒ బి.చిరంజీవి తెలిపారు. జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన జరిగే సమావేశంలో ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఎజెండా ప్రకారం వివిధ శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని జడ్పీ సిఇఒ కోరారు.

డిపిఒకు సర్పంచుల సంఘం అభినందనలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డిపిఒకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంఘం నేతలు

జిల్లా పంచాయతీ అధికారిగా బాధ్యతలు చేపట్టిన గొట్టిపాటి వెంకట నాయుడును ప్రకాశం జిల్లా పంచాయితీ సర్పంచుల సంఘం నాయకులు అభినందనలు తెలియజేశారు. సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వీరభద్రాచారి నేతృత్వంలో సర్పంచ్‌లు డిపిఒను కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జి.వీరభద్రాచారి మాట్లాడుతూ జిల్లా పంచాయితీ అధికారిగా పంచాయతీల ఉనికిని కాపాడాలని, పంచాయతీరాజ్ చట్టాన్ని యథాతథంగా అమలు చేయాలని కోరారు. కింది స్థాయిలో పంచాయతీల పాలనలో భాగస్వాములుగా ఉన్న కార్యదర్శి, సచివాలయ వ్యవస్థలను సమన్వయంతో పాటు, పంచాయతీల గొడుగు కిందకు తీసుకు రావాలని వీరభద్రాచారి కోరారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం ఉపాధ్యక్షులు రాము యాదవ్, కార్యదర్శి కర్నాటి హరిబాబు, స్వామినాథ్, సుబ్బారెడ్డి, నాగార్జున, ప్రసాదరావు పాల్గొన్నారు.